సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
మంగళవారం, 21.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 179
పేజీలు: 12 వెల: రూ. 5

## మేధావులారా.. పెదవి విప్పండి

### మీ మౌనం సమాజానికి అరిష్టం
### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

- డీలిమిటేషన్, మహిళా బిల్లులపై చర్చించండి
- సీట్లు పెంచితే దక్షిణాదికి జరిగే ప్రయోజనాలను చెప్పండి
- కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టండి
- మహిళా రిజర్వేషన్లు అంబేద్కర్ ఆలోచనల్లో భాగమే
- మహిళా రిజర్వేషన్లను అడ్డుకొని కాంగ్రెస్ కూటమి ద్రోహం చేసింది
- సోనియా, ప్రియాంక, డింపుల్, కనిమోళి, సుప్రియాలకు పదవులిస్తేనే మహిళలకు న్యాయం జరిగినట్లా?

12





### కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా రాకుండా చేస్తాం

02

- ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో ఘోరీ కట్టాం
- 2029లో కూడా పునరావృతం
- మాదిగ బిడ్డ అడ్లూరికి మంత్రి పదవి ఇస్తే జీవన్ రెడ్డి ఓర్వలేదు
- నస్తూర్‌పల్లి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి



- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు కాళేశ్వరం పేరు పెట్టి దోచుకున్నారు
- బీజేపీని అడ్డుపెట్టుకొని కేసుల నుంచి బయటపడతామంటే చూస్తూ ఊరుకోం
- సీబీఐ విచారణ నుంచి తప్పించుకునేందుకే హరీశ్ రావు ఢిల్లీ పర్యటన
- జడ్జిమెంట్ ప్రకటించకముందే న్యాయవాదులను కలవాల్సిన అవసరం ఏమొచ్చింది..?
- కాళేశ్వరం పునరుద్ధరణపై చిత్తశుద్ధితో ఉన్నాం
- సాంకేతిక నిపుణులు, మూడు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించాం

# కాళేశ్వరం దోషులను శిక్షిస్తాం

## మేడిగడ్డ బ్యారేజీ వద్ద సీఎం రేవంత్ రెడ్డి

### ఆర్థిక ప్రయోజనం కోసమే కేసీఆర్ రీడిజైన్ చేశారు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ నుంచి తప్పించుకునేందుకే మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీకి పరుగెత్తారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. జడ్జిమెం ట్ ప్రకటించకముందే న్యాయవాదులను కలవాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆరోపించారు. కేసీఆర్, హరీష్ రావులను జైల్లో పెడతామని గతంలో బీజేపీ నేతలు ప్రగల్భాలు పలికారని సీఎం విమర్శించారు. తాము రెండు సార్లు సీబీ ఐకి లేఖలు రాసి నా కేంద్రం స్పందించడం లేదని ఆయన మండిపడ్డారు. బీజేపీని అడ్డుపెట్టుకుని కేసుల నుంచి బయటపడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం దోషులను కఠినంగా శిక్షిస్తామని ఆ యన స్పష్టం చేశారు. తాము నెల రోజుల ముందే మేడిగడ్డ పర్యటన ఖరారు చేసుకున్నామని సీఎం చెప్పారు. కానీ తమ బండారం బయటపడుతుందనే భయంతోనే కేసీఆర్ నేడు కావాలనే జగిత్యాలలో రాజకీయ సభ పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన పిల్లర్లను పరిశీలించిన అనం తరం ఆయన మీడియాతో మాట్లాడారు. గోదావరి జలాలతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు 1975లో అప్పటి సీఎం జలగం వెంగళరావు మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నారని సీఎం గుర్తు చేశారు. ఆ తర్వాత 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి రూ. 38,063 కోట్లతో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి రూ. 11,700 కోట్లు ఖర్చు చేశారన్నారు. అయితే, ప్రాణహిత–చేవెళ్ల ద్వారా ఆర్థిక, రాజకీయ ప్రయోజనం లేదన్న ఉద్దేశంతోనే కేసీఆర్ రీడిజైనింగ్ పేరుతో **మిగతా 02లో**



- ప్రజల గుండెల్లో ఉన్నా.. నన్నెవరు ఏం చేయలేరు
- రైతుబంధు, దళితబంధును గాలికి వదిలేసి రైతులు, పేదలను ఏడిపిస్తున్నారు
- కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి ముచ్చట లేదు
- తెలంగాణ వ్యతిరేక శక్తులతో ప్రభుత్వం చేతులు కలిపింది
- చంద్రబాబు డైరెక్షన్ లో రేవంత్ పాలన
- మళ్లీ అధికారంలో వచ్చి చూపిస్తాం
- అధికారంలో రాగానే హైడ్రాను ఎత్తేస్తాం
- నా మొదటి సంతకం అదే
- బీఆర్ఎస్ లో చేరిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

# వెయ్యి జన్మలెత్తినా చావను

## ప్రభుత్వ పెద్దలు పాలన వదిలేసి కేసీఆర్ చావాలని కోరుకుంటున్నారు

### జగిత్యాల బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తన మరణాన్ని పదేపదే కోరుకుంటున్నారని, కోరుకునేవాళ్లు వెయ్యి జన్మలెత్తినా తా ను చావనని బీఆర్ఎస్ బాస్, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజల దీవెనలు ఉన్నంత వరకు నన్నెవరూ ఏమీ చేయలేరని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి పడదని, తెలంగాణా అభివృద్ధి కోసం తన శ్వాస ఉన్నంత వరకు పోరాడుతూనే ఉంటా నని స్పష్టం చేశారు. తాము మళ్ళీ అధికారం లోకి రావడం ఖాయమని, రాగానే హైడ్రా వ్యవస్థను మొదటి సంతకంతోనే రద్దు చేస్తా నని. జగిత్యాల వేదికగా సుదీర్ఘ విరామం తర్వాత జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో బీ ఆర్ఎస్ అధినేత కేసీఆర్ శంఖారావం పూ రించారు. కాంగ్రెస్ ప్రభు త్వంపై తనదైన శైలిలో విరుచుకుపడుతూ, భవిష్యత్తు రాజకీయాలపై స్పష్టమైన సంకేతాలిచ్చారు.

**వీళ్ల అందానికి హైడ్రా..**

ప్రజల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్.. ఈ అందానికి బోడముండా హైడ్రా అని తెచ్చారని కేసీఆర్ సెటైర్లు వేశారు. పీసీసీ ప్రెసిడెంట్ నిజామాబాద్‌లో హైడ్రాను కూడా తెస్తామంటున్నాడని, హైద్రాబాద్‌లో హైడ్రా.. నిజామాబాద్‌లో నిడ్రా.. జగిత్యాలలో జిడ్రా అంటున్నారన్నారు. మొత్తం పేదల కొంప లు కూల్చుడేనా అని కేసీఆర్ ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మూడున్నరల క్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, పేదలను **మిగతా 02లో**

## నా శేష జీవితం కేసీఆర్‌తోనే..

### జగిత్యాల సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి

12



- తెలంగాణ లో కాంగ్రెస్ ప్రజాకంఠక పాలన
- రేవంత్ కుట్రపూరిత విధానాలు, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నడు..
- రేవంత్ రెడ్డి ఆలోచనా విధానం కాంగ్రెస్‌కే ప్రమాదం





## 200 కోట్లతో కాళేశ్వరం పునరుద్ధరణ

### పనులకు శంకుస్థాపన చేసిన సీఎం

- వేద మంత్రాల నడుమ సీఎం కు పూర్ణకుంభ స్వాగతం.. ప్రత్యేక పూజలు
- భక్తుల సౌకర్యాల కోసం నూతన బస్టాండ్ నిర్మాణానికి ప్రారంభం
- కాళేశ్వరాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు

02



## లోయలో పడ్డ బస్సు.. 15మంది మృతి


### పలువురికి గాయాలు



- డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికుల ఆరోపణలు
- ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి..
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటింపు

12

ఇదీ AI
ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 21.04.2026
www.mudranews.in | @mudranews



## బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు



నల్ల ప్లాస్టిక్‌ను వీలైనంత వరకు నివారించండిచవకగా దొరికినా ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ముఖ్యంగా హాట్ ఫుడ్‌తో ఉపయోగించకండి.

## కాళేశ్వరం దోషులను
# శిక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దానికి పేరు, ఊరు మార్చేశారని విమర్శించారు. అంచనాలను ఏకంగా రూ. లక్షా 50 వేల కోట్లకు పెంచారని మండిపడ్డారు. 2016లో మొదలుపెట్టిన మేడిగడ్డను అద్భుతమని భ్రమలు కల్పించి 2018లో రాజకీయ లబ్ధి పొందారని, 2023లో బ్యారేజీ కుప్పకూలడంతో ఎన్నికల కోసం ఆ నిజాలను దాచిపెట్టాలని చూసినా ప్రకృతి బయటపెట్టిందని ఎద్దేవా చేశారు.

**కేంద్రం ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం**

ప్రాజెక్టులో సమస్యలు రాగానే 2023 నవంబర్ 1న అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ఎన్డీఎస్ఏ (ఎన్డీఎస్ఏ) ప్రాథమిక నివేదిక ఇచ్చినా పట్టించుకోలేదని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం దోపిడీపై పీసీ ఘోష్ కమిటీ సంపూర్ణ నివేదిక ఇచ్చిందని, దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తీర్మానం పంపిందని తెలిపారు. కేసీఆర్, హరీశ్ రావులను జైల్లో వేయాలని, సీబీఐకి కేసు అప్పగించాలని గతంలో డిమాండ్ చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందని సీఎం ప్రశ్నించారు. రాష్ట్రం పదే పదే లేఖలు రాస్తున్నా సీబీఐ స్పందించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేకపోయారని ముఖ్యమంత్రి విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు శ్రీపాద ఎల్లంపల్లే ప్రాణవాయువు అని, హరీశ్ రావు నిక్కర్ వేసుకోకముందే ఆ ప్రాజెక్టు ఉందని ఎద్దేవా చేశారు. ఎల్లంపల్లి నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంటలు పండించారని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తారని ముందే తెలిసి, బీజేపీ నేతల కాళ్లు పట్టుకునేందుకు హరీశ్ రావు ఢిల్లీకి వెళ్లారని ఆరోపించారు. మీడియా బయటపెట్టినా వారి నుంచి ఎలాంటి ప్రకటన లేదని, ఆ రహస్య పర్యటన వెనుక ఉన్న మతలబు ఏంటో, ఎవరెవరిని కలిశారో తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు.

**కాళేశ్వరంకు మరమ్మత్తులు**

లక్షల కోట్ల ప్రజాధనం వెచ్చించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఊరికే వదిలిపెట్టబోమని సీఎం స్పష్టత ఇచ్చారు. దానికి మరమ్మతులు చేసి ప్రజలకు నీరు అందిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించి నెల రోజుల క్రితమే అధికారులతో, సాంకేతిక నిపుణులతో సమావేశాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. అయితే, ప్రాజెక్టుకు సంబంధించిన నిజాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే బీఆర్ఎస్ నేతలు ఉద్దేశపూర్వకంగా నేడు రాజకీయ సభలు పెట్టుకున్నారని, అయినా రాష్ట్ర ప్రభుత్వం వారికి అనుమతులు ఇచ్చిందని సీఎం పేర్కొన్నారు. అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళతామని, తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షిస్తామన్నారు.

**పర్యటన సాగిందిలా..**



కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పునరుద్ధరణలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సోమవారం కుంగిన మేడిగడ్డ బ్యారేజీ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. మంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మేడిగడ్డ డ్యామ్ సైట్‌ను చేరుకున్న ముఖ్యమంత్రి పునరుద్ధరణ చేపట్టడానికి సంబంధించి జరుగుతున్న జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీతో పాటు ఇతర సంస్థల సూచనల ప్రకారం మేడిగడ్డను పునరుద్ధరించడానికి చేపట్టాల్సిన పనులపై జరుగుతున్న పరీక్షలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. బ్యారేజీ కుంగిన ప్రాంతంలో పరిస్థితులను నీటి పారుదల శాఖ అధికారులు సమగ్రంగా వివరించారు. పునరుద్ధరణకు నిర్వహిస్తున్న వివిధ పరీక్షల విధానాలను తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద పియర్స్ 20, 21, 22 వద్ద బోర్ రిగ్స్ ద్వారా జియోటెక్నికల్, జియోఫిజికల్, జీపీఆర్, శాంపిల్స్ సేకరణ పనులను పరిశీలించారు. పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో 520 బోర్ రిగ్స్ ద్వారా శాంపిల్స్ సేకరించి సెంట్రల్ వాటర్ అండ్ రీసెర్చ్ స్టేషన్ కు పంపనున్నారు. అక్కడ ల్యాబ్‌లో పరీక్షల అనంతరం దెబ్బతిన్న బ్యారేజీకి సంబంధించి పూర్తి అవగాహన రానుంది. డ్రోన్ బేస్డ్ జీపీఆర్ టెస్ట్‌కు సంబంధించి అధికారులు ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందానికి అధికారులు వివరించారు. ఈ పరీక్షల ద్వారా 20 నుంచి 30 మీటర్ల లోతు వరకు పియర్స్ వద్ద నేల స్వభావానికి సంబంధించి ఫలితాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద సీకెంట్ పైల్స్‌కు సంబంధించి సమాంతర క్రాస్‌హోల్ సీస్మిక్ టెస్ట్ వివరాలను తెలిపారు. ప్రాజెక్టు పునరుద్ధరణకు సంబంధించి బ్యారేజీ వద్ద సాగుతున్న వివిధ పరీక్షలను పరిశీలించిన అనంతరం మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించి పలు సూచనలు చేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోపాలను సరి చేసి పునరుద్ధరించడంలో ఎలా ముందుకెళ్లాలో ఒక స్పష్టత వచ్చిందని, పునరుద్ధరణలో భాగస్వామ్యమయ్యే సంస్థలు, అధికారులు, నిపుణులు సమస్యను అర్థం చేసుకుంటే సగం పరిష్కారం లభించినట్టేనని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న పరీక్షల ద్వారా సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత అధికారులు పనులు మొదలు పెట్టాలని చెప్పారు. సేకరించిన శాంపిల్స్ ద్వారా వచ్చే ఫలితాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగానే ముందుకు వెళ్లాలని, ప్రతి విషయంలో వారి అనుమతి తీసుకుని ముందుకు వెళ్లాలని స్పష్టం చేశారు. మంత్రులు ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు సీఎం వెంట ఉన్నారు.

## కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా రాకుండా చేస్తాం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాకుండా చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి శపథం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ భ్రమల్లో ఉన్నారని, ఆ కుటుంబాన్ని ఎప్పటికీ అధికారంలోకి రానివ్వనని శపథం చేశారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఘోరీ కట్టామని చెప్పారు. 2029లో కూడా అదే పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, డి.శ్రీనివాస్ కలిసి కాంగ్రెస్‌ను ఎలా అధికారంలోకి తెచ్చారో.. ఇప్పుడు తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తాం అని ప్రకటించారు. పాలకుల చిల్లర మాటలు అంటూ కేసీఆర్ చేసిన విమర్శలకు, రేవంత్ రెడ్డి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. రూ. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే అది కొన్ని నెలల్లోనే కూలేశ్వరం అయిందని చెప్పారు. తెలంగాణను పదేళ్లు లూటీ చేసిన కేసీఆర్‌ను ఉరి తీసినా తప్పులేదు అని సంచలన వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ సందర్శన అనంతరం నస్తూర్‌పల్లి బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి జగిత్యాల వేదికగా బీఆర్ఎస్‌లో చేరడంపై రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో ఒక మాదిగ బిడ్డ అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి ఇస్తే ఓర్వలేకనే జీవన్ రెడ్డి పార్టీ మారారని కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఆయనకు ఎన్నో అవకాశాలు ఇచ్చినా, కుట్రపూరితంగా బీఆర్ఎస్‌లో చేరారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ను ఓడించి తన సత్తా చాటుతానన్న సీఎం.. అప్పుడు జీవన్ రెడ్డి ఏ పార్టీలో చేరుతారో చూస్తా అని ఎద్దేవా చేశారు.

## 200 కోట్లతో కాళేశ్వరం పునరుద్ధరణ

**మహాదేవపూర్, ముద్ర:**
మహాదేవపూర్, ముద్ర: సరస్వతీ, గోదావరి పుష్కరాలు నిర్వహించనున్న తరుణంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి, గర్భాలయ పునరుద్ధరణ కోసం కొరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 200 కోట్ల పనులకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని 35 కోట్లతో నిర్మించనున్న నూతన బస్టాండ్ కు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. హెలికాప్టర్లో కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, లకు ఐటి పరిశ్రమల శాఖామంత్రి ఘన స్వాగతం పలికారు. ప్రధాన పూజారి పనగంటి నాగఫణి శర్మతో పాటు అర్చక బృందం సీఎం రేవంత్ రెడ్డికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. వీరితో ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్ కూడా ఉన్నారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకుని, అభిషేకం పూజలు నిర్వహించిన అనంతరం శుభానంద దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీధర్ బాబు వెంట మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కు మార్, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ, దేవాదాయ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంట్ కమిషనర్ హనుమంత రావు, వాస్తు శిల్పి గోవింద హరి, ఈవో మహేష్, కాళేశ్వరం సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి లు ఉన్నారు.

## వెయ్యి జన్మలెత్తినా
# నేను చావను




(మొదటి పేజీ తరువాయి)

గౌరవంగా బతకనిచ్చామని, కానీ, ఇవాళ ఇండ్ల మీదకు వచ్చి కూలగొట్టుతున్నారని, కనీసం పిల్లలను పుస్తకాలు కూడా తీసుకోనీయడం లేదన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, గ్యారెంటీగా బీఆర్ఎస్ వచ్చేది ఖాయం.. హైడ్రాను ఎత్తి అవతల పడేసుడు ఖాయమని కేసీఆర్ ప్రకటించారు. హైడ్రాను పీకేసి మొదటి సంతకంతో తీసి చెరువులో పడేస్తామని, తాము 46 వేల చెరువులు బాగు చేసినా ఒక్క గుడిసె, ఇల్లు కూడా కూలగొట్టలేదన్నారు. ఇప్పుడు మూసీ వెంట పడ్డారని, గరీబోళ్లను ఏడిపిస్తున్నరని, ఆ ప్రాజెక్టు అయ్యేది కాదు పీకేది కాదున్నారు. మూసీ పేరుతో 15 వేల ఇండ్లను కూలగొడుతున్నారని, అది ధర్మమేనా అని ప్రశ్నించారు. మూసీని మంచిగా చేయాలని, కానీ, ఎవరికీ ఇబ్బంది రావద్దన్నారు. కాంగ్రెస్ నేతలు భూములు కబ్జా పెట్టే రియల్ ఎస్టేట్ దందా నడుపుతున్నారన్నారు. ఈజీగా చేయాల్సిన దాన్ని నాశనం చేశారని, గుండాగిరి, అరాచకత్వం చేస్తున్నారని, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ఒక్క స్కీం కూడా రాలేదని కేసీఆర్ ఎద్దేవా చేశారు.

**ఎట్లుండే తెలంగాణ**

తెలంగాణ చాలా భయంకరమైసన పరిస్థితుల్లో ఉండేనని తెలంగాణ ఉద్యమ సమయాన్ని కేసీఆర్ గుర్తు చేశారు. ఎమ్మెల్యేలుగా తమకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఉండేనని, తెలంగాణ ఎట్ల ఉండేనో మనం చూడలేదా అని ప్రశ్నించారు. ఆనాడు అసెంబ్లీలో ప్రణయ్ భాస్కర్ మాట్లాడబోతే.. తెలంగాణ జాన్తనై అని నిషేధించారని, అంత భయంకరమైన వివక్ష ఉండేదని, భాష, బతుకు, నీళ్లు, ఉద్యోగాలు, వనరులు, ఆస్తుల మీద దాడి, దోపిడీ చేసి, మనలను బికారీగా వదిలిపెట్టారని గుర్తు చేశారు. రైతులు ఆగమైపోయారని, ఎస్సారెస్పీ కాలవ ఉన్నప్పటికీ వలసలు ఉండేవని, పాలమూరు జిల్లా అయితే భయంకరమైన వలసలు అని, ముసలోళ్లకు పైసలు పంపిస్తే కంట్రోల్ బియ్యం తిని బతికేటోళ్లు అని కేసీఆర్ అన్నారు. కొన్ని పార్టీలు ఏదో గొప్ప చేసినట్టు గంజి కేంద్రాలు పెట్టారని, అంత అద్వాన్న స్థితికి తెలంగాణను దిగజార్చారని చెప్పుకొచ్చారు. అలాంటి సమయంలో దేకల్ంగే అని బయల్దేరానని, వెక్కరించినా, నానా రకాలుగా అవమానపరిచినా భరించానని, మొక్కవోని ధైర్యంతో చిత్తశుద్ధితో పోరాటం చేస్తే ప్రజలు జమయ్యారన్నారు. పక్షిలాగా తెలంగాణ తిరిగితే ఉద్యమ కెరటం తయారైందని, మేం కూడా తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిందని, తెలంగాణ కావాలని జట్టుకట్టి, గెలిచి, ఢిల్లీలో తెలంగాణ ఉద్యమాన్ని పెట్టామన్నారు. కాంగ్రెస్ పార్టీ వెనక్కి పోయి ఎగబెట్టే ప్రయత్నం చేశారని, రోశయ్య హైదరాబాద్ సిటీలో 14ఎఫ్ అని తెచ్చిండని, ఎంత ఉద్యమం చేస్తే తెలంగాణ వచ్చిందో కండ్లనిండా చూశారన్నారు.

**చెరువులను బాగుచేశాం**



కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను తనకు అప్పగిస్తే.. చాలా చాలా కిష్టమైన పరిస్థితుల్లో ఎలా చేశామో ప్రజలకు తెలిసిందేనన్నారు. ఉట్టి మాటలు మాట్లాడడం కాకుండా గప్పాలు కొట్టకుండా రాష్ట్ర చరిత్రలో మిషన్ భగీరథతో ఇంటింటికీ నీళ్లిచ్చామన్నారు. సక్కగా ఉన్న తెలంగాణను ఆగం చేస్తున్నారని, ‘‘కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యి.. ఐదేండ్లు నడిచింది కదా.. ఏం బీమారి వచ్చింది..’’ అని మండిపడ్డారు. వెయ్యి జన్మలెత్తినా చావను. ఏదైనా మాట్లాడితే కేసీఆర్ చావాలి అంటున్నారని, అనేవాళ్లంతా వెయ్యి జన్మలెత్తినా చావనని కేసీఆర్ కౌంటర్ ఇచ్చారు. పిల్లి శాపాలకు ఉట్టి తెగుద్దా అని ప్రశ్నించారు. ప్రజల దీవెనలు, ఆశీర్వాదాలు ఉంటే చాలన్నారు. తమ పాలనలో తెలంగాణ బాగుపడిందని, కానీ, ఇప్పుడు ఎందుకు ఆగమైందని ప్రశ్నించారు. కరెంట్ కాకి ఎత్తుకుపోయిందా.. అని నిలదీశారు. 24 గంటల కరెంటు ఇచ్చుకున్నామని, రిపేర్లు వస్తే తప్ప కరెంట్ పోలేదని, యాదాద్రి, భద్రాద్రి కొత్తగా జనరేటింగ్ ప్లాంట్లు పుట్టామన్నారు. వీళ్లకు అధికారం అప్పజెప్పే ముందు 20 వేల మెగావాట్లకు తీసుకెళ్లామన్నారు.

**అందరినీ గౌరవిస్తాం**

జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారంటేనే ఊపు వస్తుందని పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. జీవన్ రెడ్డి జగిత్యాల జిల్లా మాత్రమే కాదు.. పాత కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ పరిసర జిల్లాల బాధ్యతలు చూడాలని కోరారు. జగిత్యాల జిల్లాలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ వేదికపై జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. జీవన్ రెడ్డిని పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తున్నాని ప్రకటించారు. ఆరు నూరైనా.. నూటికి నూటి శాతం మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని పార్టీ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా జీవన్ రెడ్డి అనేక పదవులు, సేవలు అందిస్తారని తెలిపారు. ఇది కేసీఆర్ మాట అని స్పష్టం చేశారు. 45 ఏండ్ల నుంచి మేం స్నేహితులం. భిన్న రాజకీయ సిద్ధాంతాల కారణంగా విడివిడిగా పనిచేశామని తెలిపారు. కానీ తమ స్నేహంలో లేదని పేర్కొన్నారు. బాధలు, సుఖాలు, అభిప్రాయలను పంచుకునేవాళ్లమని పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి ఉండే నిబద్ధత, ప్రజా జీవితంలో పనిచేసిన పద్ధతి ఎందరికో ఆదర్శమని కొనియాడారు. ఆయన ఒక్క జగిత్యాలలోనే కాదు.. పాత కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా, పొరుగున ఉన్న అనేక జిల్లాల్లో ఆయనకు అభిమానులు ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నా.. మంత్రిగా ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. జగిత్యాల అభివృద్ధిని ఏమాత్రం విస్మరించలేదని పేర్కొన్నారు.

తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కరీంనగర్‌లో సభ పెడితే అక్కడికి ప్రజాప్రతినిధిగా జీవన్ రెడ్డి వచ్చారని తెలిపారు. అప్పుడు బోర్నపల్లి దగ్గర గోదావరిపై బ్రిడ్జి కావాలని అడిగారని గుర్తుచేశారు. అక్కడి నుంచే ఆదేశాలిచ్చి, 70 కోట్లు మంజూరు చేసి బ్రిడ్జి కట్టించానని తెలిపారు. తన నియోజకవర్గం పట్ల జీవన్ రెడ్డికి ఉన్న ప్రేమ అద్భుతమని కొనియాడారు. అందుకే జీవన్ రెడ్డికి మంచి పేరు ఉందని అన్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే ఎలా ఉంటుందని పలువురు సర్వేలు చేసి చెప్పారని కేసీఆర్ తెలిపారు. జగిత్యాలతో పాటు చొప్పదండి, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, ఇలా చాలా నియోజకవర్గాల్లో ప్రభావం ఉంటుందని ఆ సర్వేల్లో తేలిందని పేర్కొన్నారు. అది జీవన్ రెడ్డి విశిష్టత అని వివరించారు. జీవన్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని ఒక సమితి ప్రెసిడెంట్‌గా ప్రారంభించి, ప్రజా సమస్యలపై పోరాడారని తెలిపారు. నిఖార్సైన ప్రజా కార్యకర్తగా నిరూపించుకుని అంచెలంచెలుగా ఎదిగి, అనేక పదవులు చూశారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి పదవులు కొత్త కాదు.. ఎమ్మెల్యేగా గెలవడం, మంత్రి పదవి అలంకరించడం అనేక రంగాల్లో పని చేశారని గుర్తుచేశారు. జీవన్ రెడ్డిని మొన్న కలిసినప్పుడు.. కుటుంబంలో అన్నదమ్ముల్లా కలిసి పనిచేద్దామని చెప్పానని తెలిపారు.

**తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం చేయాల్సిందే**

ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రజలకు పనికొచ్చే పని ఒక్కటి కూడా లేకపోగా.. కూల్చివేతలు, కాల్చివేతలు, పోలీసుల దాడులు, ఎదురు మాట్లాడితే వారిని పట్టుకుపోవడమే ఉందని విమర్శించారు. ఇది అసలు రాజకీయమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందని ప్రశ్నించారు. ఈ సందర్భంలో ప్రజల మంచిని కోరే ప్రతి ఒక్కరూ ఒక్కటి కావాల్సిందేనని పిలుపునిచ్చారు. తెలంగాణ పునర్నిర్మాణ యజ్ఞం మళ్లీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆనాడు బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ కరెంటు మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడి తీసుకొచ్చారని కేసీఆర్ గుర్తుచేశారు. నా ప్రాణం పోయినా సరే మీటర్లు పెట్టనని చెప్పానని, అన్నట్లుగానే పెట్టలేదని తెలిపారు. మీటర్లు పెట్టకపోతే 30 వేల కోట్లు కట్ చేస్తానని మోదీ అన్నాడని, కట్ చేశాడని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే 30 వేల కోట్ల ఆదాయాన్ని వదులుకుని కూడా తెలంగాణలో కరెంటు మీటర్లు పెట్టనివ్వలేదని చెప్పారు. కానీ కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ వెళ్లి కరెంటు మీటర్లు పెట్టేందుకు ఒప్పుకున్నారని తెలిపారు. అప్పటి రూ.30వేల కోట్లు తీసుకుని.. వ్యవసాయ కరెంటు మీటర్లకు మోటర్లు పెట్టేందుకు సంతకం పెట్టారని పేర్కొన్నారు. తొందరలోనే రాష్ట్రంలోని వ్యవసాయ కరెంట్ మోటార్లకు మీటర్లు వస్తాయని తెలిపారు. వీటిని ఎదుర్కొందామా.. మీటర్లు పెట్టకుండా యుద్ధం చేస్తామా అని పిలుపునిచ్చారు. రైతులు మంచిగుండాలి.. వ్యవసాయం మంచిగుండాలి.. పల్లెలు బాగుండాలి.. వృత్తి పనులు బాగుండాలనే కదా మనం అంటున్నామని కేసీఆర్ తెలిపారు. తమ ప్రభుత్వంలో యాదవులకు గొర్రెలు ఇప్పించామని.. ఇప్పుడొస్తున్నాయా అని ప్రశ్నించారు. మత్స్యకారుల కోసం చేప పిల్లలు పంపిణీ చేశామని.. ఇప్పుడు ఇస్తున్నారా అని అడిగారు. బీడీ కార్మికులు ఎవరూ అడగకుండానే.. పెన్షన్లు ఇచ్చామని గుర్తుచేశారు. భారతదేశంలో ఎవరైనా అలా ఇస్తారా అని ప్రశ్నించారు. కానీ కాంగ్రెసోళ్లు పెన్షన్లు పెంచుతామని ఎగ్గొట్టారని అన్నారు. అదొక్కటే కాదని.. ఇంట్లో ఉన్న ఆడబిడ్డకు మహాలక్ష్మీ అని రూ.2500 ఇస్తామని చెప్పారని.. ఇచ్చారా అని ప్రశ్నించారు. స్కూటీలు ఇచ్చారా అని అడిగారు. అలా ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఏ ఒక్కటి ఇవ్వలేదని చెప్పారు. మళ్లీ తెలంగాణ పునర్నిర్మాణ యజ్నం ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు. దాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. పోరాటం చేయాల్సిందేనని, వాళ్లను నిలదీయాల్సిందేనని అన్నారు. తెలంగాణ ప్రజలు గెలిచి నిలవాల్సిందేనని కేసీఆర్ స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు**

ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్ మాత్రమే ఎంచుకోండి పారదర్శకంగా ఉండే, మంచి నాణ్యత గల ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువ సురక్షితం.



## బీఆర్ఎస్‌లో వర్గపోరు

- మంత్రి అడ్లూరి సంచలన వ్యాఖ్యలు

**ముద్ర, కరీంనగర్:**



రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి బీఆర్ఎస్ అంతర్గత పరిస్థితి చర్చనీయాంశంగా మారింది. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం చేసిన తాజా వ్యాఖ్యలు పార్టీలో విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయనే సంకేతాలు ఇస్తున్నాయి. మంత్రి అడ్లూరి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో ఇప్పటికే ముసలం మొదలైందని, వర్గపోరు బహిర్గతమవుతోందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా హరీష్ రావు ఢిల్లీ పర్యటన పై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఆయన ఎవ రెవరు రాజకీయ నేతలను కలుస్తున్నారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ భవిష్యత్‌పై స్పష్టత ఇవ్వాలని అడ్లూరి కోరారు. పార్టీలో కుటుంబ స్థాయిలో కూడా విభేదాలు పెరిగాయన్నారు. ఇప్పటికే కల్వకుంట్ల కవిత దూరమైందని పేర్కొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ నిర్వహించబోయే బహిరంగ సభ నేపథ్యంలో పార్టీని విమర్శించేందుకు సిద్ధమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇది పార్టీ రెండుగా విడిపోయే ప్రమాదాన్ని సూచిస్తోందని మంత్రి వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పిస్తూ, వారి వైఖరి కూటీల మనస్తత్వం'గా ఉందని ఆరోపించారు. కాగా మంత్రి అడ్లూరి చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చలకు దారి తీస్తుండగా, బీఆర్ఎస్ నాయకత్వం నుంచి అధికారిక స్పందన రాలేదు.

## అంధకారంలో హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు

- మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ముద్ర, ఖమ్మం:**



బీఆర్ఎస్‌లో కాళేశ్వరరావు అనే హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారంలో ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యానించారు. సోమవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న హరీశ్ రావు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే తెలియడం లేదని ఎద్దేవా చేశారు. కొంతకాలంగా ఆయన మానసిక వేదనతో బాధపడుతున్నారని చెప్పారు. సీతారామ సాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ కు లేదన్నారు. 'సీతారామ తన రాజకీయ ఆకాంక్ష.. తన జీవిత లక్ష్యం' అని స్పష్టం చేశారు. మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి దుమ్ముగూడెం పేరుతో పనులు చేపట్టారని, ఆయన మరణానంతరం ఆగిపోయిందని చెప్పారు.

**కమీషన్ల కోసమే పనులు..**

బీఆర్ఎస్ చేపట్టిన ప్రాజెక్ట్ డిజైన్ లోపభూయిష్టంతో, కమీషన్ల కోసం అవసరమైన పనులు మాత్రమే చేపట్టారని విమర్శించారు. తాను సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి వంద కోట్లతో గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌లో నింపామని తెలిపారు. సత్తుపల్లి టన్నెల్‌కు రేవంత్ రెడ్డి రూ.1500 కోట్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు.

**వారి శాపనార్థాలు పట్టించుకోం..**

అవినీతి పరుల విమర్శలు, శాపనార్థాలు తము పట్టించుకోమని స్పష్టం చేశారు. రుణ మాఫీ చేసి ముఖ్యమంత్రి రేవంత్ చరిత్ర సృష్టించారన్నారు. 2 . రుణ మాఫీపై విమర్శలు చేసే హక్కు హరీశ్‌కు లేదన్నారు. కబ్జాలు, కమీషన్ల గురించి బీఆర్ఎస్‌కు తెలిసినంత ఏ పార్టీకి తెలియదన్నారు.

## గడ్డపోతారం పారిశ్రామిక వాడలో భారీ పేలుడు

- ఫార్మా పరిశ్రమలో పేలిన రియాక్టర్
- భయాందోళనలో సమీప ప్రాంతాల ప్రజలు

**ముద్ర, సంగారెడ్డి:**



సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లాలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో గల ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా రియాక్టర్ పేలింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ పరిశ్రమ పరిసరాల్లో వ్యాపించింది. సమాచారం తెలుసుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితిని అదుపులోకి తేవడానికి పలు ఫైర్ ఇంజన్లు రంగంలోకి దిగాయి. ఈ ఘటనలో గాయపడ్డవారి వివరాలు తెలియలేదు. అయితే పేలుడు ఎలా జరిగింది, రియాక్టర్‌లో ఏవైనా సాంకేతిక లోపాలున్నాయా అనే దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే అంశంపై కూడా విచారిస్తున్నారు. ఈ ఘటనతో గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## గచ్చిబౌలిలో అగ్ని ప్రమాదం

- అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో చెలరేగిన మంటలు
- ఇద్దరికి అస్వస్థత

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అపార్ట్‌మెంట్ మొత్తం దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. బిల్డింగ్ సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సెల్లార్‌లోని 15 ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# కలిసికట్టుగా పనిచేయాలి

- అభివృద్ధిలో కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- చెరువులను మినీ పర్యాటక ప్రాంతాలుగా మారుస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**ముద్ర, కరీంనగర్:**



రాజకీయాలు, పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా పనిచేసి కరీంనగర్ ను అభివృద్ధిని చేద్దామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పలువురు బీజేపీ కార్పొరేటర్లతో కలిసి సోమవారం తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువుల పునరుద్ధరణ పనులకు కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయా చెరువుల చుట్టూ కలియ తిరిగారు. అమృత్ 2 కింద విడుదలైన కేంద్ర నిధులతో చేపట్టబోయే పనులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో మెయిన్ రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. ఇకపై గల్లీల్లో గుంతలు పడ్డ రోడ్లపై దృష్టి సారించానున్నట్లు పేర్కొన్నారు. అతి త్వరలోనే గల్లీల్లో నూతన రోడ్లను నిర్మిస్తామని వెల్లడించారు. కరీంనగర్ లోని కొత్తపల్లి, తీగలగుట్టపల్లి, రేకుర్తి చెరువులను అమృత్ నిధులతో పునరుద్ధరించి మినీ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అమృత్ 2 నిధులతో తీగలగుట్టపల్లి, కొత్తపల్లి, రేకుర్తి చెరువుల పునరుజ్జీవం కోసం రూ.5.82 కోట్ల నిధులు విడుదలైనట్లు చెప్పారు. అందులో భాగంగా తీగలగుట్టపల్లి, కొత్తపల్లి చెరువుల పునరుజ్జీవ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. చెరువు చుట్టూ బండ్ నిర్మించడంతోపాటు అందంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కరీంనగర్ ప్రజలంతా కుటుంబాలతో కలిసి వచ్చి సేద తీరేలా చెరువులను అందంగా తీర్చిదిద్ది మినీ పర్యాటక ప్రాంతంగా మారుస్తామన్నారు. కేంద్రం నుంచి నిధులు తీసుకు రావడంతో పాటు రాష్ట్రం నుంచి నిధులు రాబడతామన్నారు. అభివృద్ధిలో కరీంనగర్ ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

## కుల గణనలో వంజరులకు అన్యాయం

- మా సంఖ్యను తక్కువ చేసి చూపిస్తున్నారు
- తెలంగాణ వంజరి సంఘాల ఆక్షేపణ

**ముద్ర, హైదరాబాద్:**



తెలంగాణలో వంజరి కులస్తులు కేవలం 62,897 మంది మాత్రమే ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ కుల గణన పేర్కొనడం పట్ల ఆ కుల సంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ లోని తార్నాకలో సోమవారం వంజరి కుల సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ తమ కులస్తులను తక్కువగా చూపించి రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బకొట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే తమ కులస్తులు 70 వేలకు మించి ఉంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రెండు లక్షలకు పైచిలుకు ఉంటారని స్పష్టం చేశారు. తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1978 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తమ కులాన్ని ఎస్టీల నుంచి బీసీ డీ జాబితాలోకి మార్చి అన్యాయం చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని తెలంగాణలో సవరించాలని పలుసార్లు కోరుతుంటే, ప్రభుత్వ శాఖలో ఉన్న కొందరు కుట్రపూరితంగా తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తమ కులానికి ఆత్మగౌరవ భవనం కోసం స్థలం కేటాయించి, ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదన్నారు. తమ కులస్తుల సమస్యలను ఏ పార్టీ పట్టించుకోలేన్నారు. సమగ్రమైన కుల గణన చేసి ప్రభుత్వ పథకాల్లో తమ కులానికి భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షులడు కాలేరు విశ్వనాథం, అఖిల భారత వంజరి సంఘం నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదగని హరినాథ్, తెలంగాణ వంజర సంఘం నాయకులు ముజకరి రవీందర్, దాత్రిక కాశీనాథ్, ధర్మరాజు, కనుకంటి శివప్రసాద్, ఎదుగాని వెంకటేశం, ఆముద లక్ష్మణ్, కాలేరు సాయి బాబా, కాలేరు శ్రీనివాస్, మల్లకు ఆనంద్, కేంద్రీ మురళీకృష్ణ, ముజకరి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఖైదీలు పరార్

- హైదరాబాద్ లో సినీ ఫక్కీలో తప్పించుకున్న రిమాండ్ ఖైదీలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ లో పోలీసుల భద్రతా వైఫల్యం బట్టబయలైంది. చంచల్‌గూడ జైలుకు చెందిన ఇద్దరు ఖైదీలు పోలీసుల కళ్లుగప్పి సినిమా ఫక్కీలో తప్పించుకోవడం సంచలనం సృష్టించింది. కోర్టు విచారణ నిమిత్తం వారిని వాహనంలో తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే..చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఇద్దరిని సోమవారం ఉదయం పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టేందుకు వాహనంలో తీసుకువెళ్లారు. అయితే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనం ఆగిన సమయంలో భద్రతా సిబ్బంది ఏమరపాటుగా ఉండటాన్ని గమనించిన ఖైదీలు చాకచక్యంగా వాహనం నుంచి దుంకి పరారయ్యారు. ఖైదీలు తప్పించుకున్న విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

దీంతో నగరవ్యాప్తంగా పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఖైదీలు ఏ దిశగా వెళ్లారో తెలుసుకునేందుకు ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. తప్పించుకున్న ఖైదీలు ఏయే కేసుల్లో నిందితులు అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపును ముమ్మరం చేశాయి.

## ఫాం హౌస్‌కే పరిమితమైన కేసీఆర్

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



కేసీఆర్ అనే పులి ఫాం హౌస్‌కే పరిమితమైందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. త్వరలోనే ఆ పులి తిన్న ఆవుల గురించి బయటపెడతామని చెప్పారు. సోమవారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌ను దగ్గర నుంచి చూస్తేనే జీవన్ రెడ్డికి ఆయన కథేమిటనేది అర్థమవుతుందన్నారు. జీవన్ రెడ్డి చేస్తున్న విమర్శలు ఆయన ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసినప్పుడు కనిపించ లేదా? అని ఆయన్ని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి సభకు పోటీగా కేసీఆర్ సభ పెట్టారని ఆరోపించారు. రేవంత్ సభ 20 రోజుల ముందే ఫిక్స్ అయిందని గుర్తు చేశారు. ఆశల పల్లకీలో ఊరేగించడం మాజీ సీఎం కేసీఆర్‌కి అలవాటేనంటూ వ్యంగ్యంగా అన్నారు. జీవన్ రెడ్డికి కేసీఆర్ ఏం ఆశలు చూపించారో అంటూ ఎద్దేవా చేశారు. మేడిగడ్డలో కేసీఆర్ చేసిన మోసాలపై జీవన్ రెడ్డే తమకు పాఠాలు చెప్పారని పీసీసీ చీఫ్ గుర్తు చేసుకున్నారు. అలాంటి జీవన్ రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి కోరస్ ఇస్తున్నారని విమర్శించారు. గతంలో కేకే, డీఎస్ లాగే జీవన్ రెడ్డి కూడా బాధపడుతారని చెప్పారు. రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రజలు కోరుకున్నారని స్పష్టం చేశారు.

# జీవన్ రెడ్డి ఐరన్ లెగ్..

- హరీష్ రావు లేకుండానే జగిత్యాల లో సభ దేనికి సంకేతం
- జీవన్ రెడ్డి చేరిక బీఆర్ఎస్ కు ఒక్క రోజు పండుగే..
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**




జీవన్ రెడ్డిది ఐరన్ లెగ్ అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విమర్శించారు. ఆయన ఏ పార్టీ లో ఉంటే అ పార్టీ సర్వనాశనం అవుతుందని ఆరోపించారు. జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ జీవన్ రెడ్డి కారణంగా బీఆర్ఎస్ లో చీలిక వచ్చే అవకాశం ఉందన్నారు. జీవన్ రెడ్డి చేరిక బీఆర్ఎస్ కు ఒక్క రోజు పండుగ మాత్రమే నన్నారు. జీవన్ రెడ్డి చేరిక నచ్చని కొందరు బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన ఫ్లెక్సీ లు తొలగించారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి చేరిక సమయంలో బీఆర్ఎస్ లో ముసలం పుట్టిందన్నారు. ఏడాది తర్వాత బయటకు వచ్చి జగిత్యాల బహిరంగ సభలో పాల్గొంటున్న కేసీఆర్ సభకు రాకుండా హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. ఈ సభకు సీనియర్ నాయకుడు హరీష్ రావు గైర్హాజరి దేనికి సంకేతమని ప్రశ్నించారు. జీవన్ రెడ్డి చేరిక పై హరీశ్ రావు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. హరీశ్ రావుతో బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలు మంతనాలు జరిపారన్నారు. జీవన్ రెడ్డి వల్ల ఎన్టీఆర్, తక్కువ వ్యవధిలో నాదెండ్ల భాస్కర్ పదవి కోల్పోయారని తెలిపారు. 2009 లో రెండోసారి కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినా వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్వర్గస్థులు అయ్యారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావులను ఉరి తీయాలని జీవన్ రెడ్డి అనలేదా? అని ప్రశ్నించారు. జీవన్ రెడ్డి పార్టీ వీడడంలో తన జోక్యం లేదని స్పష్టం చేశారు ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పీసీసీ సెక్రెటరీ బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మైనార్టీ అధ్యక్షుడు మన్సూర్, ఏఎంపీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు దామోదర్ రావు, గట్టు సతీష్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, నక్కల రవీందర్ రెడ్డి, గోలి శ్రీనివాస్, జిల్లా యూత్ అధ్యక్షుడు రాజేష్, కత్రోజ్ గిరి, శరత్ రావు, ముకేష్ ఖన్నా, కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
21.04.2026 మంగళవారం, హైదరాబాద్




మీ ముద్ర వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సేవలు చిరస్మరణీయం

*నల్గొండ జిల్లాలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ (Komatireddy Prateek Foundation) ద్వారా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన కుమారుడు దివంగత ప్రతీక్ రెడ్డి జ్ఞాపకార్థం అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి మరియు మౌలిక సదుపాయాల కల్పనపై ఈ ఫౌండేషన్ దృష్టి సారించింది.*



## ఈ ఫౌండేషన్ ద్వారా జరుగుతున్న ముఖ్యమైన సేవా కార్యక్రమాలు

**విద్యా రంగం (Educational Initiatives)**

కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ప్రాథమికోన్నత బొట్టుగూడ పాఠశాల (నల్లగొండ) సుమారు ₹8 కోట్ల నుండి ₹10 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని ప్రతి ఫౌండేషన్ నిధులతో నిర్మించారు. తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 2026 జనవరి 27న ఈ పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన సౌకర్యాల విషయానికి వస్తే... 36 ఏసీ తరగతి గదులు, ఏఐ ఆధారిత విద్యా బోధన, డిజిటల్ ల్యాబ్స్, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ ఇన్స్ట్రక్షన్ బోర్డులు, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన క్రీడలు ఉన్నాయి. ఒక కార్పొరేట్ పాఠశాలను తలదన్నే రీతిలో తీర్చిదిద్దబడిన ఈ పాఠశాలలో విద్యను మాత్రం ఉచితంగానే అందిస్తారు. ప్రతి తరగతి గదిలో స్మార్ట్ బోర్డు, ప్రొజెక్టర్, సౌండ్ సిస్టమ్ కూడా ఉన్నాయి. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ప్రతి విద్యార్థి యొక్క సామర్థ్యాన్ని అంచనా వేసి, వారికి అనుగుణంగా బోధనా పద్ధతులు రూపొందిస్తారు. డిజిటల్ ల్యాబ్స్ లో విద్యార్థులు కంప్యూటర్లు, ప్రోగ్రామింగ్, రోబోటిక్స్ నేర్చుకోవచ్చు.

*ఈ పాఠశాలను నడిపిస్తున్న వ్యక్తి గౌరవనీయులు ప్రస్తుత మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు.*
*ఈ పాఠశాలలో ప్రస్తుతం శ్రీమతి టి సుధారాణి గారు రిటైర్డ్ ప్రిన్సిపల్ పర్యవేక్షిస్తున్నారు.*

**జూనియర్ కళాశాల:**

నల్గొండలో సుమారు ₹8 కోట్లతో ప్రతీక్ మెమోరియల్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ (బాలురకు) మరియు వొకేషనల్ కాలేజీ నిర్మించారు.

**ఉచిత శిక్షణ & స్టడీ మెటీరియల్:**

EAMCET (EAPCET) వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజనం మరియు స్టడీ మెటీరియల్‌తో కూడిన కోచింగ్‌ను ఫౌండేషన్ అందిస్తోంది. అంతేకాకుండా, రోడ్డు ప్రమాద బాధితులకు


డాక్టర్ సుంకరి రాజారామ్
ప్రభుత్వ మహిళా
డిగ్రీ (స్వ)కళాశాల నల్గొండ

మరియు అత్యవసర స్థితిలో ఉన్న పేదలకు ఉచిత అంబులెన్స్ సేవలను ఫౌండేషన్ నిర్వహిస్తోంది. నిరుద్యోగ యువత కోసం క్రమం తప్పకుండా జాబ్ మేళాలను నిర్వహించి, మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది.

**మహిళా సాధికారత:**

స్వయం సహాయక సంఘాల మహిళల కోసం సోలార్ పవర్ బ్యాటరీ యూనిట్ల ఏర్పాటు వంటి వినూత్న ఉపాధి పథకాలకు మద్దతు ఇస్తోంది.

**వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి నీటి సంరక్షణ:**

వ్యవసాయ క్షేత్రాల్లో ఫామ్ పాండ్స్ (పంటకుంటలు), ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చేస్తోంది.

**రైతులకు చేయూత:**

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరాలో సహాయం చేయడంతో పాటు సాంకేతిక అవగాహన కల్పిస్తోంది.

**వెంకటరెడ్డి రాజకీయ జీవితం, కుమారుడి విషాదం**

నల్లగొండ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంకటరెడ్డి, ఒక దఫా భువనగిరి నుంచి ఎంపీగానూ ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత తెలుగునేల విభజన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉండిపోగా, వెంకటరెడ్డి పార్టీని అంటిపెట్టుకుని సాగారు. ఇక రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రాగా, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోమారు మంత్రి అయ్యారు. అయితే ఆయన మంత్రిగా ఉన్న సమయంలోనే 2011లో పటాన్ చెరు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రియ పుత్రుడు ప్రతీక్ రెడ్డి చనిపోయారు. కేవలం 19 ఏళ్ల వయసులోనే తన కుమారుడిని కోల్పోయిన బాధ వెంకటరెడ్డిని కుమిలించేసింది. ప్రతీక్ రెడ్డిని గుర్తు చేసుకుంటూ ఆయన పలుమార్లు కన్నీటి పర్యంతమయ్యారు. కానీ ఆ విషాదాన్ని ఆయన దృఢ సంకల్పంగా మార్చుకున్నారు. తన కుమారుడి పేరు మీద ఒక ట్రస్టును ఏర్పాటు చేసి, సమాజానికి ఉపయోగపడే ఎన్నో పనులు చేపట్టారు.

KOMATIREDDY
PRATHEEK
FOUNDATION
Caring & Sharing

## ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సేవలు – పుస్తకాలు, ఫర్నీచర్, ఏసీ

కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్థాపించిన ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ మారం వెంకట గోన రెడ్డి గారి ఆధ్వర్యంలో పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రభుత్వ కళాశాలలకు పుస్తకాలు సరఫరా చేయడం ఆ ఫౌండేషన్ యొక్క ప్రధాన కార్యక్రమాల్లో ఒకటి. చాలామంది పేద విద్యార్థులు పాఠ్యపుస్తకాలు కొనుగోలు చేయలేని పరిస్థితిలో, ఈ ఫౌండేషన్ వారికి అన్ని తరగతుల పుస్తకాలు ఉచితంగా అందిస్తోంది. అంతేకాకుండా, ప్రభుత్వ కళాశాలల్లో అవసరమైన ఫర్నీచర్‌ను కూడా ఫౌండేషన్ సమకూరుస్తోంది. బెంచీలు, టేబుళ్లు, బ్లాక్ బోర్డులు, విద్యార్థులకు అవసరమైన ఇతర సామగ్రిని ప్రభుత్వ విద్యా సంస్థలకు అందించి, అక్కడి బోధనా వాతావరణాన్ని మెరుగుపరుస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) నల్గొండలో కళాశాల విద్యార్థుల కోసం ఒక కోటి రూపాయలు వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించడం జరిగింది. అంతేకాకుండా కళాశాల విద్యార్థుల కోసం డ్యూయల్ డెస్క్ లు మరియు కళాశాలలో రెండు RO తో కూడిన మంచినీటి సదుపాయం కల్పించడం జరిగింది. అలాగే నల్గొండ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి (డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ) ఏసీ సౌకర్యాన్ని కల్పించారు. వేసవి కాలంలో గ్రంథాలయంలో చదువుకోవడం దుర్భరంగా ఉండేది. ఇప్పుడు ఆ ఏసీ సౌకర్యం వల్ల విద్యార్థులు, పరిశోధకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు ఎంతో సౌకర్యంగా గ్రంథాలయాన్ని వినియోగించుకుంటున్నారు. ఇలా చిన్నచిన్న సేవలు కూడా సమాజంలో పెద్ద మార్పును తీసుకువస్తాయని వెంకటరెడ్డి నిరూపిస్తున్నారు.

## ఉన్నత విద్య కోసం సహాయం, వందలాది విద్యార్థులకు ఆసరా

**ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ పాఠశాల స్థాయి విద్యకే పరిమితం కాదు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను (higher studies) చదవాలనుకున్నప్పుడు వారికి ఆర్థిక సహాయం అందిస్తోంది. ఇంజనీరింగ్, మెడిసిన్, లా, పీజీ కోర్సులు, పిహెచ్డీ వంటి వాటికి ఫీజులు, పుస్తకాలు, వసతి ఖర్చులు భరించలేని ప్రతిభావంతులైన విద్యార్థులను ఫౌండేషన్ గుర్తించి, ఇప్పటివరకు వందలాది మంది విద్యార్థులకు ఈ ఫౌండేషన్ సహాయం చేసింది. వీరిలో చాలామంది నేడు వివిధ రంగాల్లో స్థిరపడి, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ సహాయం వల్ల చాలామంది విద్యార్థులు చదువు మానేసే దుస్థితి తప్పింది. ఫౌండేషన్ యొక్క ఈ కార్యక్రమానికి స్థానికంగా ఎంతో మంచి స్పందన లభిస్తోంది. ఎంతోమంది దాతలు కూడా ఇప్పుడు ముందుకు వచ్చి ఈ ప్రయత్నంలో భాగస్వాములవుతున్నారు. ప్రతీక్ రెడ్డి స్మృతిగా సాగుతున్న ఈ సేవలు ఆ యువకుడి ఆశయాలను సజీవంగా ఉంచుతున్నాయి. క్రీడల కోసం ఇండోర్ స్టేడియం, బాస్కెట్బాల్ కోర్ట్, ఫుట్బాల్ మైదానం, స్విమ్మింగ్ పూల్ వంటివి ఉన్నాయి. అంతటితో ఆగకుండా, విద్యార్థులకు ఉచిత వసతి గృహాలు, ఉచిత భోజనం, ఉచిత వైద్య సౌకర్యం కూడా కల్పిస్తున్నారు.**

## సమాజం స్పందన, మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృషికి కొనియాడుట

వెంకటరెడ్డి కృషి పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. రాజకీయాల్లో ఉన్నా, మంత్రిగా ఉన్నా, ఎన్ని హోదాల్లో ఉన్నా సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆయన సంకల్పం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. ప్రతీక్ రెడ్డి కోల్పోయిన నొప్పిని ఇలా సేవా కార్యక్రమాలుగా మార్చడం గొప్ప మానవతా దృక్పథాన్ని చూపిస్తుంది. ప్రభుత్వ కళాశాలలకు పుస్తకాలు, ఫర్నీచర్ సరఫరా చేయడం, జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఏసీ సౌకర్యం కల్పించడం, పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలవడం, నూతన పాఠశాలను నిర్మించడం - ఇవన్నీ ఒకే దాత నుంచి రావడం అసాధారణం. స్థానిక ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకటరెడ్డి దంపతులకు పూలమాలలు వేసి సన్మానిస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఈ ప్రయత్నం విపరీతంగా వైరల్ అవుతోంది. ఇలాంటి ఫౌండేషన్లు దేశంలో ఇంకా చాలా అవసరం. ప్రతీక్ రెడ్డి జీవించి ఉంటే ఎంతో సంతోషించేవాడు. అతడి పేరు మీద జరుగుతున్న ఈ సత్కార్యాలు, నిజంగా అతడి ఆత్మకు శాంతిని ఇస్తాయి. వెంకటరెడ్డి ఇలాగే ఇంకా చాలా మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దాలని ప్రజలు కోరుకుంటున్నారు.









శ్రీమతి టి సుధారాణి (రిటైర్డ్ ప్రిన్సిపల్)
కోమటిరెడ్డి ప్రతీక్ ఉన్నత పాఠశాల పర్యవేక్షకులు


డాక్టర్ ఎం వి. గోన రెడ్డి
సి ఈ ఓ, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్.

# జగన్, షర్మిల... ఇద్దరూ పాదయాత్రకు రెడీ!

రాజకీయాల్లో పాదయాత్రలు కొత్త కాదు. కానీ పాదయాత్ర మొదలు పెట్టింది వైయస్ రాజశేఖర్ రెడ్డి. వరుసగా రెండుసార్లు ఓటమితో ఏపీలో పూర్తి నిర్వేదంతో ఉండేది కాంగ్రెస్ పార్టీ. దేశంలో అయితే దాదాపు పది సంవత్సరాలకు పైగా అధికారానికి దూరంగా ఉండేది. అటువంటి సమయంలో పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగారు వైయస్ రాజశేఖర్ రెడ్డి. అయితే ఆయన తరువాత ఎంతోమంది పాదయాత్రలు చేసి అధికారంలోకి వచ్చారు. చంద్రబాబుతో పాటు జగన్ మోహన్ రెడ్డి ఈకోవలోకి చేరుతారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి సైతం పాదయాత్ర చేసి అక్కడ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారు. అయితే ప్రతిపక్షంలో ఉన్న పార్టీలకు పాదయాత్ర అనేది అధికారం తెచ్చిపెట్టే ఒక అద్భుతమైన ఆయుధంగా మారింది. అందుకే ఇప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి మరోసారి వైసీపీని అధికారంలోకి తెచ్చేందుకు వ్యూహరచన చేస్తున్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఆయనకు తన సోదరి షర్మిల నుంచి పిడుగు లాంటి వార్త వచ్చింది. గతంలో షర్మిల కూడా పాదయాత్ర చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన తర్వాత ఆయన అక్రమాస్తుల కేసుల్లో జైలుకు వెళ్లిపోయారు. అయితే కొంతవరకు పాదయాత్ర చేసిన తర్వాత జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ జరిగింది. అటు తరువాత షర్మిల ఆ పాదయాత్ర బాధ్యతలు తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం పాదయాత్ర చేశారు. జగన్మోహన్ రెడ్డి లేని లోటును తీర్చారు. ఒక విధంగా 2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 67 సీట్లు తెచ్చుకోవడానికి షర్మిల పాదయాత్ర కూడా ఒక కారణం. అయితే షర్మిల పాదయాత్రను స్ఫూర్తిగా తీసుకొని 2017లో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. అలా వచ్చిన తర్వాత షర్మిలను పట్టించుకోవడం మానేశారు. దీంతో షర్మిల జగన్మోహన్ రెడ్డిని కేవలం కుటుంబ పరంగా కాదు రాజకీయంగాను విభేదిస్తూ వచ్చారు. ఇప్పటికీ విభేదిస్తూ వస్తున్నారు. వచ్చే ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. ఎట్టి పరిస్థితుల్లో ఆ పార్టీ అధికారంలోకి రావాలి. రాకపోతే చాలా ఇబ్బంది కరం కూడా. అందుకే జగన్మోహన్ రెడ్డి సుదీర్ఘకాలం పాదయాత్రకు ప్లాన్ చేశారు. వచ్చే ఏడాది వైయస్సార్ జయంతి రోజున పాదయాత్రను ప్రారంభించి 2029 ఎన్నికల ముంగిట ముగించాలని ప్రణాళిక వేశారు. కానీ ఇప్పుడు షర్మిల సైతం పాదయాత్ర చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. సరిగ్గా జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసే సమయానికి తాను మొదలు పెట్టాలని షర్మిల భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షర్మిల వల్ల జగన్మోహన్ రెడ్డికి ఎంతలా పొలిటికల్ డ్యామేజ్ జరిగిందో తెలియంది కాదు. అందుకే షర్మిల పాదయాత్ర అంటేనే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి బెంబేలెత్తిపోతున్నారు. అయితే త్వరలో షర్మిల తన పాదయాత్ర షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ షర్మిల పాదయాత్ర ప్రారంభిస్తే మాత్రం జగన్మోహన్ రెడ్డికి కష్టమని వైసిపి శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నాయి.






– కనపర్తి రవి

# సంతోషానికి మూలం సంబంధాలు

మనిషి జీవితంలో నిజమైన ఆనందం ఏమిటి? విజయం, డబ్బు, లేదా కుటుంబంస్నేహితులా? ఈ ప్రశ్నకు సమాధానం వ్యక్తికి మారుతుందనే సంగతి తెలిసిందే. అయితే, దీన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకునేందుకు హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు 88 ఏళ్లపాటు నిర్వహించిన సుదీర్ఘ అధ్యయన కీలక అధ్యయనం. 1938లో ప్రారంభమైన ఈ అధ్యయనంలో 724 మంది వ్యక్తుల జీవనశైలి, ఆరోగ్య రికార్డులు పరిశీలించబడ్డాయి, సంతోషానికి ప్రధాన కారణం సానుకూలంగా లేదని తేలింది. కుటుంబం, స్నేహితులు, సమాజంతో పటిష్ఠ బంధాలు కలిగినవారు ఎక్కువకాలం ఆరోగ్యంగా, సంతోషంగా జీవిస్తున్నారని పరిశోధకులు పేర్కొన్నారు. బంధాల సంఖ్యకన్నా వాటి నాణ్యత ముఖ్యమని చెప్పారు. ముఖ్యంగా వైవాహిక సంబంధాలలో సంతృప్తి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని సూచిస్తుంది. అలాగే, ఒంటరితనం ధూమపానం, మద్యపానం లాగే ప్రమాదకరమని హెచ్చరిక. ఎంత ప్రస్తుతం ఉన్నా, స్నేహితులు, ఆప్తులతో గడపడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. బాధలు, గత సంఘటనలను మనసులో పెట్టుకోకుండా ముందుకు సాగితేనే సంతోషకర జీవితం సాధ్యమైంది. మొత్తానికి, ఆనందం బయట కాదు.. మన బంధాల్లోనే ఉందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 21.04.2026
www.mudranews.in | @mudranews



**బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు :**



రీసైక్లింగ్ సింబల్ చెక్ చేయండి
ప్లాస్టిక్ వస్తువులపై రీసిన్ కోడ్ (1-7) ఉండాలి. లేకపోతే వాటిని కొనొద్దు.

## సంక్షిప్తంగా..

### చెరువులు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి




**ముద్ర, నారాయణపేట:** జిల్లాలోని మొత్తం 375 చెరువుల సర్వే చేసి వాటికి సరిహద్దులు నిర్ణయించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని వీసీ హాల్ లో మొక్కల పెంపకం లక్ష్యాలపై జిల్లాస్థాయి పర్యవేక్షణ సమన్వయ కమిటీ సమావేశం, అలాగే చిత్తడి నేలలు డీమ్డ్ ఫారెస్ట్‌ల పై సమావేశం నిర్వహించారు. జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలన్నారు. జిల్లాకు 12 లక్షల 71 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా ఉందని, శాఖల వారీగా ఎవరెవరికి ఎంత టార్గెట్ ఉందో వాటిని చేరుకోవాలని ఆదేశించారు. వన మహోత్సవంలో నాటేందుకు పొడవాటి మొక్కలు, పూల మొక్కలు, మల్బరీ మొక్కలు, పండ్ల మొక్కలను నిల్వ చేసుకోవాలన్నారు. అన్ని శాఖలకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ, నీటి పారుదల, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో చెరువుల సరిహద్దులను సూచించాలన్నారు. శిఖం భూములు, పట్టా భూముల వివరాలను నమోదు చేయాలన్నారు.

### మహిళా బిల్లు ముసుగులో కేంద్రం కుట్ర



**ముద్ర, కూకట్‌పల్లి:** నారీ శక్తి పేరిట డీలిమిటేషన్ ప్రక్రియను తెరపైకి తెచ్చి, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యతను తగ్గించి, ఉత్తరాది అండతో ఎప్పటికీ అధికారంలో ఉండాలనేది కేంద్రం కుట్ర అని తెలంగాణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి ఇన్‌ఛార్జ్ బండి రమేష్ అన్నారు. రాజ్యాంగ 131వ సవరణ (మహిళా బిల్లు) పార్లమెంట్‌లో వీగిపోవడం వెనుక ఉన్న వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. 543 పార్లమెంట్ స్థానాలకు మహిళా రిజర్వేషన్ వర్తింపజేస్తూ బిల్లు ప్రవేశపెడితే ఏకగ్రీవంగా మద్దతిస్తామని, 2011 జనాభా లెక్కల కాకుండా తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ కోరుతోందని స్పష్టం చేశారు. ఈ కుట్రను పసిగట్టి దేశంలోని ఇతర పార్టీలను జాగృతం చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సఫలీకృతులయ్యారని కొనియాడారు. బీజేపీకి మహిళలపై నిజమైన ప్రేమ ఉంటే, రాబోయే ఉత్తరప్రదేశ్ ఎన్నికల నుంచే 543 స్థానాల్లో రిజర్వేషన్లు అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

### వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి వి. సీతారామ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శాట్స్ ఆధ్వర్యంలో ఈ శిబిరాలు నిర్వహించబడనున్నాయి. ఈ శిబిరాలు ఏప్రిల్ 24 నుంచి జూన్ 7 వరకు జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించబడతాయి. పి.డి., పి.ఇ.టి లు సీనియర్ క్రీడాకారులు శిక్షణా శిబిరాల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీనియర్ క్రీడాకారులు తప్పనిసరిగా జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న అనుభవం కలిగి ఉండాలి. దరఖాస్తులతో పాటు సంబంధిత క్రీడా ధృవపత్రాలను జతపరచాలని సూచించారు. స్థానికంగా శిబిరాలు నిర్వహించగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, గ్రామీణ, కొత్త కేంద్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 23లోగా జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం, ఐడీఓసి భవనం వద్ద దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా పంపవచ్చని వెల్లడించారు.

# ప్రజావాణికి అనూహ్య స్పందన





**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** కలెక్టరెట్ కార్యాలయ సమావేశం హాలు నందు నిర్వహించిన ప్రజావాణికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తు లు సమర్పించా రని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. భూసంబంధిత సమస్యలు, విద్యుత్, పింఛన్లు, రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం, ఉపాధి అంశాలపై 125 వినతులు అందాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై సమయపాలనతో చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్ పి సి ఇ ఓ సుధీర్,ఆర్ డి ఓ వాసు చంద్ర,డి ఆర్ డి ఓ శ్రీనివాస్, మైనారిటీ అధికారి రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు తో కలిసి ఆయన ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ వారం వివిధ సమస్యలపై మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణిలో మన జిల్లాకు సంబంధించి మొత్తం 111 ఆర్జీలు పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా వెంటనే పరిష్కరించాలన్నారు.



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జీవి శ్యాంప్రసాద్ లాల్, జెడ్పీ సీఈవో దేవసహాయం, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి మొత్తం 45 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.

# తాగునీటికి ఇబ్బందులు పడొద్దు

**- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** ప్రజల దాహార్తి తీర్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గడియారం చౌరస్తా లో తన సొంత నిధులతో యెన్నం జలధార పథకం పేరుతో వ్యాపారులకు ఉచితంగా కూల్ వాటర్ క్యాన్స్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడియారం చౌరస్తా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉండడంతో ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు ఇక్కడికి రాకపోకలు సాగిస్తారని తెలిపారు. షాపులకు వచ్చే కస్టమర్లు, అక్కడ పనిచేసే కార్మికులు, వ్యాపారులు అందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా జలధార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని నగరంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. గడియారం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ద్వారా ఉచితంగా కూల్ వాటర్ పొందేలా సదుపాయం కల్పించామని తెలిపారు. ప్రస్తుత వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలను గమనించాలని, ప్రతి ఒక్కరూ తరచూ నీరు తాగుతూ డీహైడ్రేషన్ కు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ అనురాధ , పెద్ద గొల్ల నర్సింహులు, ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాయకులు అజ్మత్ అలీ, మున్నూరు రవి తదితరులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 108 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేశారు. ప్రజలు సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి లో ముందుకు దూసుకుపోతున్నదన్నారు. రేషన్ కార్డు కలిగిన వారికి 6 కిలోల సన్నబియ్యం ఉచితంగా చేస్తున్నామన్నారు. 99 రోజుల కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం అవుతున్నాయని, ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు స్వీకరించి వెంటనే చర్యలు చేపడుతున్నామని పేర్కొ న్నారు. జూన్ 2 నుంచి రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

**ఈనెల 23 చివరి తేదీ**
**అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని నాగర్ కర్నూల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్లో నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కమిటీ పూర్తి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 25న మొదటి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని జర్నలిస్టులంతా ఈనెల 23వ తేదీలోగా అక్రెడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఆ తేదీ లోపు వచ్చిన దరఖాస్తులను మొదటి విడతగా పరిశీలించి ఈనెల 30వ తేదీలోగా కార్డులు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అక్రెడిటేషన్ ప్రక్రియను రంగారెడ్డి జిల్లా నుంచి నాగర్ కర్నూల్ జిల్లాకు మార్చేందుకు కృషి చేసినందుకు అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలోని బ్రహ్మగిరి, మున్నూరు ప్రాంతాలకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తూ అక్రెడిటేషన్ కార్డులపై ప్రత్యేక గుర్తింపునకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి జె. కిరణ్ కుమార్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు పి. విజయ్ కుమార్, యం. చంద్రశేఖర్ రావు, సాయిలు సాగర్, కే. ప్రదీప్ కుమార్, దస్తగిరి, ముబీన్ అహ్మద్, సురేష్ కుమార్, పి. వెంకటస్వామి, ఎం. శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ పాల్గొన్నారు.

# వసతి గృహాలలో పరిశుభ్రత పాటించాలి





**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వసతి గృహాలలో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల వంట గదులు, పరిసరాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నాణ్యతపై అవగాహన కింద సోమవారం జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్సీ బీసీ బాలుర వసతి గృహాలను కలెక్టర్ దీపక్ తివారి సందర్శించారు. వంట విధానం, వంట తయారీ ప్రక్రియను పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. వంటకు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరుకులు నాణ్యతతో సరైన ప్రమాణాలతో ఉండాలని ఆదేశించారు. వసతి గృహాల పరిసరాల్లో పారిశుద్ధ్యం పరిస్థితిని పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. విద్యార్థులు తిరిగి వచ్చే వరకు ఏవైనా మరమ్మతు పనులు ఉంటే వాటిని పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, మాధవ రెడ్డి, ఎంపీడీవో వినోద్ కుమార్, సంబంధిత అధికారులు ఉన్నారు.

**వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** సంక్షేమ వసతి గృహాలను సిబ్బంది శుభ్రంగా ఉంచుకుంటేనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటారని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. అదనపు కలెక్టర్ సోమవారం గద్వాలలోని బీసీ బాలికల సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటశాలను, స్నానపు గదులు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులకు ఎప్పటికప్పుడు రుచికరమైన వంటలను వండించి పెట్టాలన్నారు. వసతి గృహ వాస్‌రూంలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం బాగుంటుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రస్తుతం అక్కడ కల్పించిన సౌకర్యాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. వసతిగృహ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఇలాగే ఎల్లప్పుడూ సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు వార్డెన్ కు, అక్కడి సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత , వసతి గృహ వార్డెన్ ప్రమీల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం




**ముద్ర, కాప్రా:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని అదనపు కమిషనర్ (శానిటేషన్) రఘు ప్రసాద్ సిబ్బందిని హెచ్చరించారు. కాప్రా సర్కిల్‌లోని పలు ప్రాంతాలను ఆయన సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. వంపుగూడ కాలనీలో దోమల నివారణ చర్యలను పరిశీలిస్తూ, మురికికుంటల్లో లార్వా అభివృద్ధిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఏఈ ఎంటమాలజీ రమేష్, సానిటరీ సూపర్వైజర్లు సుదర్శన్, జవాన్ రామకృష్ణ, శ్రీనివాస్, సర్కిల్ ఇంచార్జ్ నవీన్ కుమార్ రెడ్డి, సూపర్వైజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలు పరిరక్షించుకోవాలి



**ముద్ర, కాప్రా:** భారత సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని శ్రీ లలితా త్రిపుర సుందర ఆలయ పీఠాధిపతి స్వామి శ్రీ బ్రహ్మానంద సరస్వతి అన్నారు. కాప్రా శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో జరిగిన హిందూ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. హిందువులంతా ఐక్యతతో మెలగాలి , కులవర్గ భేదాలు ఉండకూడదు అప్పుడే భారత సాంప్రదాయాలు ముందుకు వెలుతాయని అన్నారు. మానవులందరూ ఒకే దైవంశం సంభూతులు కాబట్టి వారి మధ్య భేదాలు చూపడం సరైనది కాదని, వర్ణ వ్యవస్థ కేవలం గుణం, కర్మ ఆధారంగా ఉంటుందన్నారు. ప్రతి హిందువు ఆలయాలలో పాటిస్తున్న ఆచారాలను గౌరవించాలి, వాటి పరిరక్షణకు ముందుండాలి, హిందూ ధర్మాన్ని, సంస్కృతిని పరిరక్షణ కోసం, దేశ ధర్మం కోసం ప్రతి ఒక్కరూ నిలబడాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన వక్తలు సూర్యనారాయణ మూర్తి దీప వేముల కాప్రా హిందూ సమ్మేళనా సమితి అధ్యక్షులు కొండల్ గౌడ్, ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి ,కార్యదర్శి వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శి విజయలక్ష్మి , కోశాధికారి అరిసి కృష్ణ పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి రాజకీయ పోస్టర్ ఆవిష్కరణ




**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజిగిరిలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ రాజకీయ పోరాట ప్రకటన సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడు తూ తెలంగాణ ప్రజల హక్కుల సాధన, ప్రజా సమస్యల పరిష్కారం, మహిళా సాధికారత కోసం కవిత నిరంతరం పోరాటం చేస్తున్నారన్నారు. ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ హాల్ లో జరిగే మహాసభ కు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి సీనియర్ నాయకులు, ప్రశాంత్ చారి (ఇన్‌చార్జ్), ఈగ సంతోష్, లలితా యాదవ్, భవాని వేముల, సంధ్యా రెడ్డి, నవీన్ యాదవ్, రజిత, సాయి, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** తిమాజీపేట మండలం మరికల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, హర్ష వర్ధన్, బహదూర్ శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, చిల్కా భాస్కర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవ్, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు గోపాల్ నాయక్, టౌన్ ప్రెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

**కేజీబీవీ పాఠశాల భవనానికి శంకుస్థాపన**

మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నాగనూలు గ్రామంలో కస్తూర్బా విద్యాల యం భవన నిర్మాణానికి శంకు స్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఈవో రమేష్, మునిసిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, కౌన్సిలర్లు వసంత సంతోష్ గౌడ్, నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

**పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ**

ఎమ్మెల్యే సొంత గ్రామమైన తూడుకుర్తి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాఠశాలలో భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశమున్నందున అదనపు తరగతి గదులు అవసరమని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదల కోసం సిఎస్ఆర్ నిధులు, ఇతర వనరుల ద్వారా సహాయం అందించే దిశగా కృషి జరుగుతోందన్నారు.

## ప్రజావాణిలో 14 ఫిర్యాదులు స్వీకరణ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 14 అర్జీలను స్వీకరించినట్లు సంగ్రామ్ సింగ్ జి పాటిల్ తెలిపారు. సోమవారం నిర్వహించిన జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## గుండెపోటు రోగిని కాపాడిన ప్రభుత్వ వైద్యులు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో వైద్యులు గుండెపోటుతో వచ్చిన రోగి ప్రాణాలను కాపాడారు. ఆదివారం అర్ధరాత్రి కోడేరు మండల కేంద్రానికి చెందిన నరసింహ(45)కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న జనరల్ ఫిజిషియన్ సూర్యనారాయణ మార్గదర్శకత్వంలో డాక్టర్ మాచిపెద్ది మౌర్య, వైద్య బృందం రోగిని పలు పరీక్షలు నిర్వహించి గుండెపోటు అని నిర్ధారించి, తక్షణమే 'థ్రాంబోలైసిస్' అందించి, సుమారు రూ.45 వేల విలువైన టెనెక్టిప్లేస్ ఇంజక్షన్ ఇచ్చి రోగి ప్రాణాలు కాపాడగలిగారు. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కు తరలించారు. మెడికల్ సూపరింటెండెంట్ ఉషారాణి వైద్య బృందాన్ని అభినందించారు. డాక్టర్లు మౌర్య, వంశీ, తన్మై, నర్సింగ్ సిబ్బంది వెంకటమ్మ, హలీమా పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లీన్ & గ్రీన్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ రాధాకృష్ణ మెంబెర్ షిప్ కో ఆర్డినేటర్ హకీమ్ విశ్వ ప్రసాద్, క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, కార్యదర్శి సురేష్ కుమార్, మాజీ అధ్యక్షులు పోల శ్రీనివాసులు, ప్రేమ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
మంగళవారం 21.04.2026
www.mudranews.in | @mudranews



**బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు:**

వేడి ఆహారంతో ప్లాస్టిక్ వాడకం తగ్గించండి. వేడి వల్ల రసాయనాలు బయటకు వచ్చే అవకాశం ఎక్కువ.



# సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

**- చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యం**
**- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడొద్దు**
**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర న్యూస్, ధర్మపురి:**
ధర్మపురి నియోజకవర్గంలోని రోళ్లవాగు, అక్కెపెల్లి ఎత్తిపోతల పథకంతో పాటు పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి అక్కెపెల్లి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని రైతులకు సాగునీటిని అందించడానికి రోళ్లవాగుతో పాటు అక్కెపల్లి ఎత్తిపోతల పథకం, వెల్గటూర్ చెరువు, స్తంభంపల్లి, రంగదామంపల్లి, యశ్వంతరావుపేట చెరువు కూడికతీత పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీటిని అందిస్తానన్నారు. రైతుల ప్రయోజనమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల విషయంలో కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమైందని ఆరోపించారు. బీఆర్ ఎస్ హయాంలో అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించి అంచనాలు పెంచి మధ్యలోనే నిలిపివేశారని గుర్తు చేశారు. భూ సేకరణ చేయకుండానే రోళ్ల వాగు ప్రాజెక్ట్ పనులు ప్రారంభించార న్నారు.

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ 2016లో రూ. 60 కోట్ల అంచనాలతో రోళ్ల వాగు ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి రూ. 140 కోట్లకు పెంచారని ఆరోపించారు. అంచనాలు పెంచినా ప్రాజెక్టు నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదో కొప్పుల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వ్ ఫారెస్ట్ అనుమతి లేకుండానే రోళ్లవాగు ప్రాజెక్టు ప్రారంభించారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రోళ్ల వాగు ప్రాజెక్టు కు ఫారెస్ట్ అనుమతులు తెచ్చమన్నారు. ఇందుకు సంబంధించి ఆటవీ శాఖకు రూ.31 లక్షలు చెల్లించినట్లు మంత్రి తెలిపారు. నోరు ఉందని కొప్పుల ఈశ్వర్ మాట్లాడితే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. అక్కపెల్లి ఎత్తిపోతలకు సంబంధించి కనీసం డ్రాయింగ్ పనులు చేయించలేని కొప్పుల ఈశ్వర్ తనపై తప్పుడు ఆరోపణ చేయడం తగదన్నారు. వారం రోజుల క్రితం అక్క పెల్లి ఎత్తిపోతలకు సంబంధించి డ్రాయింగ్ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. త్వరలోనే అక్కపెల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పత్తిపాక రిజ ర్వాయర్ పై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నియోజకవర్గంలో మేడారం రిజర్వాయర్, కాళేశ్వరం ప్రాజెక్ట్ పేస్ –2లో భాగంగా వందల ఎకరాల భూములు సేకరించి స్థానిక రైతులకు చుక్క నీరు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత బిల్లులు ఇప్పించి పనులు కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో చర్చించి నియోజకవర్గంలోని పెండింగ్ పనులు పూర్తిచేసి రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు. మంత్రి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

## ముస్నూరు కాపు సంఘానికి న్యాయం చేయాలి

**-మున్సిపల్ చైర్ పర్సన్ కు వినతి**



**కోరుట్ల, ముద్ర:** మున్నూరు కాపు సంఘానికి న్యాయం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ కు విన్నవించారు. పట్టణంలోని వేములవాడ రోడ్డులో గల హనుమాన్ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ మాట్లాడుతూ సర్వే నంబర్ 1215 లోని 19.5 పరంపోగు భూమి మున్నూరు కాపు పటేల్ సంక్షేమ సంఘానిదేనని పట్టణానికి చెందిన 20 కాపు సంఘాల (ఆమ్ సంఘం) తరలివచ్చినట్లు చెప్పారు . స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. వెంటనే మున్సిపల్ ఏజెండా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. అనంతరం చెదలు సత్యనారాయణ స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ కోరుట్ల పట్టణ మున్నూరు కాపు పటేల్ సంక్షేమ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక ధర్మపురి వాడలోని పీతేరు కుంటగా పిలవబడే సర్వ నంబర్ 1217 లో గల 19.5 గుంటల పరం పోగు భూమిని సుమారు 35 – 40 సంవత్సరాల నుంచి మోకాపై ఉన్నామని చెప్పారు. ఈ స్థలంపై గతంలోనే అప్పటి కలెక్టర్ స్మితా సబర్వాల్ సంబంధిత రెవెన్యూ అధికారులతో భూమి పూజ చేసి స్థలాన్ని మున్నూరు కాపు పటేల్ సంక్షేమ సంఘానికి అప్పగించారని గుర్తు చేశారు. కానీ స్థలాన్ని మున్సిపల్ ఆధ్వర్యంలో పార్క్ ఏర్పాటు చేయాలని ఏజెండాలో పొందుపరిచినట్లు తెలిపారు. దీనిపై మున్సిపల్ అధికారులకు పూర్తిస్థాయి సమాచారం లేకపోవడంతో ఏజెండాలో పొందుపరిచారన్నారు. వెంటనే తొలగించాలని వినతి పత్రం అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జిల్లా మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడుబండారి శంకర్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, నాయకులు బండారి శ్రీనివాస్, జాప లచ్చన్న, గుర్రాల ప్రవీణ్, నీలి శ్రీనివాస్, పట్టణానికి చెందిన 20 కాపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం బసవేశ్వర జయంతి వేడు కలను ఘనంగా నిర్వహించారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి బసవేశ్వర చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు కుల, లింగ వివక్షతను వ్యతిరేకించారన్నారు. సమ సమాజ స్థాపన కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, నాయకులు వీరేష్, సాగర్, ఆనంద్ తో పాటు గ్రామాల సర్పంచ్ లు, బీజేపీ పట్టణ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డంప్ యార్డ్ పై బీజేపీ యుద్ధభేరి..

**- నిరసనలతో ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయం**
**- కార్యాచరణపై నాయకులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ భేటీ**



**ముద్ర, కరీంనగర్:**
హుజూరాబాద్ శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ యుద్ధ భేరీ మోగించింది. రాస్తారోకోలు, ధర్నాలు, దీక్షలతో సహా వివిధ రూపాల్లో ఉద్యమాన్ని తీవ్ర తరం చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చేదాకా పోరాటాలను కొనసాగించేందుకు సిద్ధమవుతోంది. బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులు సోమవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తో భేటీ అయ్యారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయంతో హుజూరాబాద్ ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఈ సందర్భంగా ఆయా పార్టీ శ్రేణులు కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా ేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటైతే ఆ పరిసరాల్లో నివసించే ప్రజల బతుకులు దుర్భరంగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు ఉంటే తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. హుజూరాబాద్ యువతకు పెళ్లి సంబంధాలు కూడా వచ్చే పరిస్థితి ఉండదని చెప్పారు. కరీంనగర్ డంపింగ్ యార్డుతో చుట్టుపక్కల ప్రజలు పడుతున్న బాధలను తాను కళ్లారా చూశానని తెలిపారు. అలాంటి పరిస్థితి ఎవరికీ రావొద్దన్నారు. హుజూరాబాద్ ప్రజల ఆందోళన సరైందేనన్నారు. బీజేపీ పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. ఒక్కసారి ఉద్యమం ప్రారంభిస్తేచ వెనకడుగు వేయొద్దన్నారు. సర్కార్ దిగొచ్చేదాకా వివిధ రూపాల్లో ఉధృతంగా పోరాడుతూనే ఉండాలని పిలుపునిచ్చారు. ఉద్యమ సెగ సర్కార్ పెద్దలకు తాకే దాకా పోరాడాలని కోరారు. అందుకు అవసరమైన సహకారం తాను అందిస్తానని హామీ ఇచ్చారు. కొన్ని రాజకీయ పార్టీలు, నాయకులు బీజేపీ ఇమేజ్ ను దెబ్బతీసేందుకు హేళనగా మాట్లాడినా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మన పోరాటాలే వారికి జవాబు కావాలన్నారు. అనంతరం డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై బండి సంజయ్ చర్చించారు. ఏరోజు ఏయే కార్యక్రమాలు చేపట్టాలనే అంశంపై పలు సూచనలు చేశారు.

కలెక్టర్ నుంచి రాష్ట్ర పెద్దల వరకు కలిసి నిరసనను తెలియజేయాలని కోరారు. ప్రజా క్షేత్రంలో పోరాటాలను చేస్తూనే మరోవైపు న్యాయ పోరాటానికి సైతం సిద్ధం కావాలని సూచించారు. తొలుత మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో బీజేపీ ముఖ్య నేతలతో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సమా వేశమై ఉద్యమ కార్యాచరణ ప్రతిపాదనలపై చర్చించనున్నారు. అనంతరం హుజూ రాబాద్ లో భారీ ఎత్తున నిరసన చేపట్టాలని నిర్ణయిం చారు. ఆ తరు వాత జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీ పంలో పెద్ద ఎత్తున నిరసన దీక్ష చేయాలని భావిస్తున్నారు.

## అంగన్ వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ నియోజకవర్గంలోని అంగన్ వాడీ టీచర్లకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్మార్ట్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ల ద్వారా పోషణ, ఆరోగ్యపరమైన వివరాలను నమోదు చేయడం సులభం అవుతుందని తెలిపారు. అంగన్ వాడీ టీచర్ల సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. చిన్నారుల సమగ్ర ప్రగతిలో వారి కృషి ఎంతగానో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్య క్షుడు రితేష్ రాథోడ్, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మ రాజు, కౌన్సి లర్ గంజి విజయ్ కుమార్ (రాజు), రాచకొండ సాగర్, అధికారులు పాల్గొన్నారు.

## జగిత్యాల సభకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



**ముద్ర, కరీంనగర్:**
జగిత్యాలలో జరిగిన కేసీఆర్ భారీ బహిరంగ సభకు పాలకుర్తి మండలం నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, అల్ట్రాటెక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సోమవారం భారీగా తరలి వెళ్లారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ కాంట్రాక్టు కార్మికులు, చుట్టూ పక్క గ్రామాలలో నాయకులు కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా కౌశిక హరి మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామమన్నారు. వచ్చే ఎన్నకల్లో తప్పకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

# నైపుణ్యాల సాధనే లక్ష్యంగా విద్యా బోధన..

**- కలెక్టర్ అభిలాష అభినవ్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా సోమవారం సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. ఆహార పదార్థాల ముడిసరుకుల గడువు వివరాలు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి రోజు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. ఫుడ్ కమిటీ లో సభ్యులుగా ఉన్న విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ వారికి అందిస్తున్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల గడువు తేదీ రిజిస్టర్లలో తప్పనిసరి నమోదు చేసి, ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న విద్య గురించి వివరాలు అడిగి తెలుసు కున్నారు. డీఈవో భోజన్న, డీటీడీఓ అంబాజీ, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మి కాంత రావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్ మల్లేష్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**కోరుట్ల, ముద్ర:** పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ కోరుట్ల సూపర్ వైజర్ అలువాల భారతి సూచించారు. కోరుట్ల పట్టణంలోని సాయిరాంనగర్ ఒకటో అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అలువాల భారతి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్ తినకుండా ఇంట్లో తయారు చేసిన ఆహారం తీసుకోవాలని సూచించారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలను అంగన్ వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటల తో పాటు విద్య అందిస్తారని తెలిపారు. అంగన్ వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో అన్న వర్గాల వారికి అనేక రకాల సేవలు అందుతున్నాయని గుర్తు చేశారు. అనంతరం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, అంగన్ వాడీ టీచర్లు టీ. శోభారాణి, సీహెచ్. మాధవి, బి. శంకరమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు
స్టీల్ లేదా చెక్క పరికరాలకు మారండి. దీర్ఘకాలికంగా ఇవే సురక్షితమైన ఎంపికలు.


# ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి




**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**

సోమవారం సద్దుల చెరువు (మినీ ట్యాంక్ బండ్) వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరై బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో సమాజంలో ఉన్న కుల వ్యవస్థ, అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వం, న్యాయం, ధర్మం వంటి విలువలను ప్రచారం చేసిన మహనీయుడు అని కొనియాడారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటేనని, కులాలు, ఉపకు లాలు లేవన్న మహాత్మా బసవేశ్వరుని సందేశం ఆచరణీయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నరసింహ, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలి, మున్సిపల్ కౌన్సిలర్లు, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షుడు వల్లెం శేఖర్, కారి సాహితీ, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరిలో..

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాహితీ, గౌడ కమ్యూనిటీ సభ్యులు, కుల సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర అందిస్తోంది..

- వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ముద్ర, వలిగొండ:**



రైతులు పండించిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం గిట్టు బాటు ధర అందిస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం వలిగొండ మండలంలోని పహిల్వాన్‌పురం, మాందాపురం, నాతాళ్ళగూడెం, అక్కంపల్లి, లింగరాజుపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటను విక్రయించుకునే విధంగా కొనుగోలు కేంద్రాలలో అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం సుమారు 3 లక్షల 77 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ఈ సంవత్సరం సుమారు 4 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. రైతులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు వడ్లపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని వెల్లడించారు.

అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన చైర్మన్ కార్యాలయం, కవరింగ్ షెడ్డులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. 56 మంది లబ్దిదారులకు రూ. 19,69,500 విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. రూ. 76,08,816ల విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల, గ్రామాల ప్రజాప్రతి నిధులు, నాయకులు, ఐకేపీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**



ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరి గుట్ట, రాజాపేట మండలాల్లో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, అక్రమ మైనింగ్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నాయకులు జిల్లా కేంద్రంలో ఆందోళన చేశారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామ పరిధిలోని సర్వే నం.726లో గల విలువైన ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి వెంచర్లుగా మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. సోమవారం వినతి పత్రం అందజేసేందుకు వచ్చిన నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో అధికారుల ఛాంబర్ వద్ద తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. నాయకులు లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో తోపులాట జరిగింది. అనంతరం అదనపు కలెక్టర్లను కలిసిన నాయకులు, రాజకీయ పలుకుబడితో జరుగుతున్న భూకబ్జాలపై విచారణ జరిపి భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాజాపేట మండలం చల్లూరు గుట్టల్లోని సర్వే నం. 322లో సాగుతున్న అక్రమ మైనింగ్‌పై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామ చంద్రారెడ్డి, కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో నాయకులు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా భారీ బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ ప్రకతి సంపదను కొల్లగొడుతు న్నారని, దీనివల్ల స్థానిక గ్రామస్తులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని గడుపుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారు లకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందిం చడం లేదని, అక్రమ మైనింగ్‌పై తక్షణమే చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, నాయకులు బొట్ల యాదయ్య, ఖలీల్, నరేందర్‌రెడ్డి, సట్టు తిరుమలేశ్, రాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, పలుగుల నవీన్, కొండల్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి,**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్ర మంలో ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి గ్రీవిన్స్ లకు కూడ ప్రాధాన్యత ఇస్తూ ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబంధించి 31 దరఖాస్తులు, డిఆర్డిఏ 4, మున్సిపాలిటీ 3, డిపిఓ 3, డిఎం అండ్ హెచ్ఓ 3 మిగిలిన 17 దరఖాస్తు లు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయని వాటిని ఆయా శాఖలకు పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కే సీతారామారావు, సీఈఓ జడ్పీ శిరీష, డిపిఓ యాదగిరి, డిఎంహెచ్వో పి వెంకట రమణ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, సిపిఓ కిషన్, డీఎస్ఓ, డిటిడిఓ శంకర్, ఎస్సీ కార్పొరేషన్ డెవలప్మెంట్ అధికారి దయానందరాణి, డిఐ ఈఓ బి సులోచన రాణి, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీలత, సాయి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరిలో..

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 55 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖ 40, మున్సిపాలిటీ 5, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 2, జిల్లా పంచాయతీ 2, జిల్లా విద్యా శాఖ 2, కో-ఆపరేటివ్, ఎస్సీ కార్పొరేషన్, చేనేత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

సోమవారం భువనగిరి కొత్త బస్టాండ్ ఆవరణలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను డీపో మేనేజర్ మురళీ కృష్ణ, స్థానిక కౌన్సిలర్ శ్రీలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సేవా సమితి గత కొన్నేళ్లుగా భువనగిరి బస్టాండ్ లో వేసవిలో చలివేంద్రంను ఏర్పాటు చేయడం అభినందనీయమని న్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సమితి సభ్యులు సోమ కృష్ణమూర్తి, కస్తూరి లక్ష్మీనారాయణ, సోమ సర స్వతి, వంగపల్లి అంజయ్య స్వామి, కుక్కడపు చంద్రశేఖర్, చింతపండు రాజు, పసుపునూరి వాణి, బుస్సా కృష్ణవేణి, గట్టు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**




ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా పూర్తయిందని, తెలంగాణలో కూడా అదే స్థాయిలో పురోగతి సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి ,భువనగిరి తాసిల్దార్ జగన్మోహన్ ప్రసాద్, ఎలక్షన్స్ సెల్ సూపర్డెండ్ కృష్ణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 'కళాశాలకు కవితా నీరాజనం' సంపుటి ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

కళాశాలలో చాలాకాలం బోధనా నైపుణ్యంతో సేవలందించిన అధ్యాపకుల సేవలను గుర్తించి వారిలోని మంచిని కవిత్వంగా రాసిన కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ బోడ జగన్నాథ్ అభినందనీయులని స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన "కళాశాలకు కవితా నీరాజనం సంపుటి" ఆవిష్కరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించి సంపుటిని ఆవిష్కరిస్తూ ఆయన మాట్లాడారు. కవి వ్యక్తులలోని మంచిని గుర్తించి ఆ మంచినే కవిత్వంగా మలచి సమాజానికి అందిస్తాడని తెలిపారు. ఈ సంపుటి విద్యార్థిలోకానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంజి రమేష్ మాట్లాడుతూ ఈ సంపుటి కళాశాల ప్రగతికి నిదర్శనమని అన్నారు. సంపుటి రచయిత తెలుగు అధ్యాపకుడు డాక్టర్ బోడ జగన్నాథ్ మాట్లాడుతూ కళాశాలలో చాలా కాలం బోధనా సేవలు అందించి ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన అధ్యాపకుల పట్ల కలిగిన అభిమానమే ఈ సంపుటిలోని రచనలకు ప్రేరణ అని అన్నారు. అధ్యాపకులు బాల్ రెడ్డి, కిష్టయ్య సిద్ధిరాములు, బాలరాజు, రామకృష్ణ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ భాస్కర్ లింగమూర్తి బాలయ్య శ్రీకాంత్ పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ కృషి

- ఎస్పీ కె. నరసింహ



**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**

పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎస్పీ నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు దారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధితులకు భరోసా కల్పించాలన్నారు.

## డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్ ను జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు సీఈఓ ఎన్ శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందాడి ఉపేందర్ రెడ్డి, జిల్లా టీజీవో కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్, జిల్లా ఎంపీడీవో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## పాఠశాలలో భోజనం రుచికరంగా ఉండేలా చూడాలి

- అదనపు కలెక్టర్ భాస్కర రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** పాఠశాలలో భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో సోమవారం భువనగిరి కేంద్రంలో కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని తెలిపారు. .

## 'అర్హులైన వారికే సభ్యత్వం కల్పించాలి'



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలోని చేనేత సహకార సంఘం తీరుపై స్థానిక కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా మగ్గం నేస్తున్నప్పటికీ అర్హులైన అనేక మంది కార్మికులకు నేటికీ సంఘంలో సభ్యత్వం కల్పించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్ వెంకారెడ్డికి, చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌రావుకు వేరు వేరుగా వినతి పత్రం అందజేశారు. తక్షణమే అర్హులైన ప్రతి చేనేత కార్మికునికి సభ్యత్వంతో పాటు ఓటు హక్కు కల్పించాలని, సభ్యత్వ ప్రక్రియ పూర్తయిన తర్వాతే సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరగని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కార్మికులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పున్న వెంకటేశం, రాపోలు ప్రభాకర్, భారత మృత్యుంజయ, గంజి శ్రీనివాస్, ముదుదుడ్ల రమేష్, కడవేరు శ్రీనివాస్, సంగిశెట్టి గణేష్, పొట్టబత్తుల వెంకటేష్ ఉన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన 'కంచర్ల'



**ముద్ర, మోత్కూర్:** రాగిబావి గ్రామంలో వార్డ్ సభ్యులు ఎలుగ యాదిరెడ్డి, సత్తిరెడ్డి తండ్రి ఎలుగ భూపాల్ రెడ్డి అనారోగ్యంతో సోమవారం మరణించడంతో ఆ కుటుంబాన్ని బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పసునూరి సత్తిరెడ్డి మాజీ సర్పంచి రాంపాక నాగయ్య, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు :**

ఒకసారి వాడే ప్లాస్టిక్‌ను మళ్లీ వాడొద్దు. ఇవి ఒక్కసారి కోసం మాత్రమే తయారు చేస్తారు. రీయూజ్ చేయడం ప్రమాదకరం.





## బసవేశ్వరుడికి కలెక్టర్ నివాళులు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

బసవేశ్వరుడి సందేశం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి 893వ జయంతోత్సవాన్ని నిర్వహించారు. బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, వీరశైవ లింగాయత్ మెదక్ జిల్లా అధ్యక్షుడు లింగన్నగారి మల్లప్ప, గౌరవ అధ్యక్షుడు పి.డి. ఆనందం, జనరల్ సెక్రటరీ వీరేశం, కోశాధికారి ప్రభు కుమార్, శెట్టి శ్రీకాంతప్ప, సందీప్ కుమార్, కౌన్సిలర్లు లలిత విశ్వం, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## 30 రోజుల సినిమా వర్క్ షాప్ ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



షార్ట్ ఫిలిమ్స్, సినిమా రంగాల్లో రాణించాలని అనుకునే వారికోసం సిద్ధిపేటలో 30 రోజుల వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని సిద్ధిపేట మూవీ ఆర్టిస్ట్స్ అండ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిరంజీవి తెలిపారు. సిద్ధిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అసోసియేషన్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 26 నుండి కార్యక్రమానికి సంబంధించిన పేర్ల నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని మోర్ సూపర్ మార్కెట్ వెనుక గల వేద సొల్యూషన్స్ కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, ఫిలిం మేకింగ్‌లో ఉన్న 24 విభాగాలపై వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సిద్ధిపేట పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో అసోసియేషన్ నాయకులు నర్సింలు, లింగమూర్తి, శ్రావణ్, స్వామి చరణ్, హరీష్, నవీన, కనక లక్ష్మీ, సుభాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'రాముడితో రాజకీయం చేయొద్దు'

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



రామకోటితో రాజకీయం చేస్తే సహించేది లేదని సిద్ధిపేట రామకోటి బృందం నాయకులు మధుసూదన్ అన్నారు. సిద్ధిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రామకోటి భక్త బృందం సభ్యులు మాట్లాడారు. సిద్ధిపేట పట్టణానికి చెందిన గుండు రవితేజ అనే వ్యక్తి రామకోటితో రేవంత్ రెడ్డి పేరు రాసి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారని ఆరోపించారు. రామకోటిలో రాజకీయ నాయకుల పేర్లు రాసినందుకు గతంలోనే మార్కండేయ దేవాలయంలో తనను మందలించామని తెలిపారు. అయినప్పటికీ సామాజిక మాధ్యమాల ద్వారా మళ్లీ వీడియోలు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా గుండు రవితేజ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో రామకోటి భక్త బృందం సభ్యులు శ్రీనివాసచారి, నాగరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## 30న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు


**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 30న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర విద్యా సదస్సుకు జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి కాంగోటి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యా సదస్సు గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రభుత్వం విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. విద్య అందరికీ సమానంగా అందకుండా విధానాలు రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగానికి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నిధులను కేటాయించడం లేదని, వందలాది ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధం చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంగయ్య, హీరా లాల్, రాజేంద్ర ప్రసాద్, నజీరుద్దీన్, అల్వాల రమేష్, సంగీత, శశిధర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సాయిబాబా, నసీరుద్దీన్, మంగ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) అబ్దుల్ హమీద్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుంచి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్‌తో కలిసి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, హౌసింగ్, ఆసరా పింఛన్లు మరియు ఇతర అర్జీలు కలిపి మొత్తం 163 దరఖాస్తులు వచ్చాయి. అర్జీదారులకు న్యాయం చేసి తిరిగి అర్జీలు పెట్టుకునే పరిస్థితి రాకుండా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



పాఠశాలల్లో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో తొలి రోజు మెదక్ జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు విధానాన్ని పరిశీలించారు. సరుకులు నాణ్యతతో, సరైన ప్రమాణాలతో ఉండాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. మరుగుదొడ్లకు తలుపుల మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. డిజిటల్ జనగణన-2027 పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కౌడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు జనగణన-2027 నిర్వహణలో భాగంగా మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు దిశానిర్దేశం చేశారు. శిక్షణలో ప్రతి అంశంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల వద్దకు వెళ్లి అర్జీలు స్వీకరణ

మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రతిమా సింగ్ స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు భూ సమస్యలు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లపై అర్జీలు అందజేశారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య కలిసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గురుకులాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలి : కలెక్టర్ హైమావతి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

సిద్దిపేట జిల్లాలోని అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో వంట గదులు, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్, తరగతి గదులు, వరండాలు, మైదానం చుట్టుపక్కల శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ఈ వారం థీమ్ 'వెల్ఫేర్ వీక్' కార్యాచరణలో భాగంగా జిల్లాలోని అన్ని సంక్షేమ విద్యాసంస్థల్లో వంటశాలలు, శానిటేషన్‌పై సమగ్ర శుభ్రత, పరిశుభ్రత ప్రమాణాలను ప్రణాళిక ప్రకారం అమలు పరచడానికి జిల్లా అధికార యంత్రాంగం నోడల్ అధికారులను నియమించి గురుకుల సంక్షేమ విద్యాసంస్థలను సందర్శింపచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం సంక్షేమ విద్యాసంస్థల్లో శానిటేషన్ డ్రైవ్‌పై అవగాహన కల్పిస్తూ పగడ్బందీగా నిర్వహించడం అని చెప్పారు. శానిటేషన్ డ్రైవ్‌లో విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన అలవాట్లు అలవరుచుకోవాలని, ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. గురుకుల ప్రాంగణాన్ని పరిశీలించారు. వరండాలు, మరుగుదొడ్లు, వంటశాలను వెంటనే శుభ్రంగా కడగాలని ఆదేశించారు. వంటగదిలోకి వెళ్లి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అన్నం, పాలకూర పప్పు, బెండకాయ కర్రీ, రసం పరిశీలించగా పాలకూర పప్పు పలుచగా ఉండకూడదని, పచ్చి పులుసును రసం అని చెప్పడం సరైంది కాదని వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, ప్రిన్సిపల్ రాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న గురుకుల విద్యాసంస్థలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు నియమించిన నోడల్ అధికారులు ఆయా సంస్థలను సందర్శించి వసతులను పరిశీలించి జిల్లా అధికార యంత్రాంగానికి నివేదికలు అందజేశారు.



## పరిశోధన పద్ధతులపై జాతీయ స్థాయి వెబినార్

- సామాజిక శాస్త్రాల పరిశోధకులకు పెరుగుతున్న ఉపాధి అవకాశాలు
- ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మంజుల్ సింగ్

**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట:**




ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్ధిపేట సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో సోమవారం పరిశోధన పద్ధతులపై జాతీయ స్థాయి వెబినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర ప్రొఫెసర్ ఎం. రాములు, గౌరవ అతిథిగా ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ప్రొఫెసర్ మంజుల్ సింగ్, ప్రధాన వక్తగా తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ నుంచి డా. కప్పకొండల్ హాజరయ్యారు. ప్రధాన వక్త డాక్టర్ కొండల్ మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులు పరిశోధనలు ఎలా ప్రారంభించాలో, వాటి మెలకువలు, నాణ్యతా ప్రమాణాలపై వివరించారు. పరిశోధన అంశం ఎంపిక, రివ్యూ ఆఫ్ లిటరేచర్, రీసెర్చ్ గ్యాప్, ఆబ్జెక్టివ్స్, దత్తాంశ సేకరణ, దత్తాంశ విశ్లేషణ, ప్రాజెక్టు రూపకల్పన వంటి అంశాలపై క్షుణ్ణంగా బోధించారు. శాస్త్రీయ పద్ధతులతో పరిశోధనలు చేసినప్పుడే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఢిల్లీ యూనివర్సిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మంజుల్ సింగ్ మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక పరిశోధన వైపు దృష్టి సారిస్తే అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు ఎప్పటికప్పుడు నాణ్యతా ప్రమాణాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలు సమాజానికి ఎంతో అవసరమని, మార్కెట్ మొత్తం పరిశోధనపై ఆధారపడి ఉందని తెలిపారు. ప్రొఫెసర్ రాములు మాట్లాడుతూ పరిశోధనకు మూలం సమస్యను ఎంచుకోవడంలోనే ఆధారపడి ఉంటుందన్నారు. ఇటువంటి వెబినార్లు విద్యార్థులు పరిశోధన పట్ల ఆకర్షితులయ్యేలా ఉపయోగపడతాయని చెప్పారు. ఈ జాతీయ స్థాయి వెబినార్ కన్వీనర్ డా. ఎం. శ్రద్ధానందం మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ వెబినార్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సీ.హెచ్. మధుసూదన్, పరీక్షల నియంత్రణ అధికారి డా. గోపాల్ సుదర్శనం, కార్యక్రమం కన్వీనర్ డా. ఏ. అనురాధ, డా. ఎన్. హరిబాబు, అధ్యాపకులు డా. ఎం. కొండల్ రెడ్డి, బి. బిక్షపతి, కె. శేఖర్, పద్మ, ఎస్. మహేందర్ పాల్గొన్నారు. సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు పాల్గొన్నారు.



## అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

**ముద్ర ప్రతినిధి మెదక్ :**

మెదక్ జిల్లా అదనపు ఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో గార్డ్ ఆఫ్ ఆనర్‌ను స్వీకరించారు. అనంతరం ఆయన అధికారులతో సమావేశమై జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితులపై జిల్లా అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల భద్రత, చట్టసంరక్షణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

సంక్షేమ వారోత్సవాలలో భాగంగా మెదక్ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను జిల్లా అధికారి ప్రతాప్ సింగ్, పీఆర్ డీఈ అమరేశ్వర్ సోమవారం సందర్శించారు. కళాశాలలో టాయిలెట్లు, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌ల పరిశుభ్రతను వారు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.



## కో-ఆప్షన్ సభ్యుల పదవులకు 12 నామినేషన్లు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటాపోటీ

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ మున్సిపల్ కార్యాలయంలో కోఆప్షన్ సభ్యుల నియామకానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ తరపున అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ తరపున రాగి వనజ, కొర్వి రాములు, సయ్యద్ తాహిర్ అలీ, గౌడిచెర్ల అనూష నామినేషన్లు సమర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, పట్టణ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, నాయకులు మ్యాడం బాలకృష్ణ, కౌన్సిలర్లు గంట సంపత్, ఎండి మన్సూర్, శివరామకృష్ణ, హరిత నర్సింగ్ రావు, ముత్యంగౌడ్, మాజీ కౌన్సిలర్ గేలెన్, జాయిముర్రే, క్రాంతి దీప్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ తరపున అభ్యర్థులు వంజరి జయరాజ్, మెంగాని విజయలక్ష్మి, నౌషిన్, ఫాజిల్ దరఖాస్తులు కమీషనర్ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, మాజీ కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీది కృష్ణ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్ కుమార్, జుబేర్ అహ్మద్, సోహెల్, దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్లు కొట్టాల విశ్వం, మాయ మల్లేశం, విజయలక్ష్మి, నాయకులు సాయి కుమార్, శ్రీను నాయక్, వేణు తదితరులు పాల్గొన్నారు..

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు

చౌక వస్తువులపై అప్రమత్తంగా ఉండండి తక్కువ ధర అంటే నాణ్యత తగ్గే అవకాశం ఎక్కువ.



# ఆర్టీసీ సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

- జిల్లా అధికార ప్రతినిధి వాకిటి



**ముద్ర, వనపర్తి :**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై సమ్మెను జయప్రదం చేయాలని, సమ్మెకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు వాకిటి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 22న మొదటి డ్యూటీ నుంచి జరిగే సమ్మెను జయప్రదం చేసి ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, 2021 వేతన సవరణ 30% ఫిట్మెంట్ తో అమలు చేయాలని, 2025 వేతన సవరణ అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బులు ప్రతినెల రూ.400 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి, బెడ్ విన్నర్ పోస్టులను పర్మినెంట్ ఉద్యోగాల కింద భర్తీ చేయాలన్నారు. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారాలు తగ్గించాలని కండక్టర్ డైవర్లపై కేఎంపీఎల్, ఈపీకే వేధింపులు మానుకొవాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వమే కొని ఆర్టీసీకి ఇవ్వాలని, ఆర్టీసీ స్థలాలను ఈవీ బస్సులకు ఇవ్వరాదన్నారు. అద్దె బస్సులను, డ్రైవర్లను ఆర్టీసీలో విలీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్లో పనిచేస్తున్న సిబ్బందిని కరీంనగర్ జోన్, హైదరాబాద్ జోన్లకు బలవంతగా బదిలీ చేసే ఉత్తర్వులను రద్దు చేయాలని , 2019 సమ్మె కాలంలో నమోదైన పోలీస్ కేసులను ఎత్తివేయాలని, మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని, అన్ని కేటగిరీలలోని ఖాళీలను భర్తీ చేయాలని, రిటైరైన ఉద్యోగుల బకాయిలను అన్నిటినీ చెల్లించాలని, చెల్లించటంతో పాటు దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.



# కుకట్‌పల్లిలో బైక్ దొంగల ముఠా అరెస్ట్

- నలుగురు మైనర్ల నుంచి 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**ముద్ర, కూకట్‌పల్లి :**

పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్ నేరస్థులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలైన బాలాజీ నగర్, గాయత్రీ నగర్, సప్తగిరి కాలనీలలో ద్విచక్ర వాహనాల చోరీలపై వరుస ఫిర్యాదులు అందాయి. ఈ కేసులను సవాలుగా తీసుకున్న క్రైమ్ టీం, డీఎస్ఐ జి. రవీందర్ రెడ్డి నాయకత్వంలో దర్యాప్తు చేపట్టింది. సోమవారం ఉదయం కూకట్‌పల్లి బస్ స్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అరెస్టయిన వారిలో సంగీత్ నగర్‌కు చెందిన కోమల లక్ష్మణ్ (15), అబ్బనపురి కృష్ణమూర్తి (14) మరియు దయార్‌గూడకు చెందిన నూనె విశాల్ (17) ఉన్నారు. వీరంతా పదో తరగతి విద్యార్థులు కావడం గమనార్హం. వీరి నుంచి సుజుకి స్కూటీ (AP39RX9064), టీవీఎస్ జూపిటర్ (TG08E6355), హోండా యాక్టివా (TS26B7549), డియో మోటార్ సైకిల్ (KA05KV1064) వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చురుగ్గా వ్యవహరించిన క్రైమ్ స్టాఫ్ ఎం. అమృత్ రావు, ఎస్. భాస్కర్, డి. రవీందర్ తదితర బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.



# యువతి ప్రాణాలను కాపాడిన పోలీసులు

**ముద్ర, కూకట్‌పల్లి:**

ఐడీఎల్ చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువతిని పోలీసులు కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. కల్వకుర్తికి చెందిన రియా (20) అనే డిప్లొమా విద్యార్థిని ప్రస్తుతం కేపీహెచ్‌బీలోని ఓ హాస్టల్‌లో నివసిస్తోంది. సోమవారం ఉదయం వ్యక్తిగత కారణాలతో ఆమె మనస్తాపానికి గురై, ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో ఐడీఎల్ సరస్సు వద్దకు చేరుకుంది. ఉదయం 11:55 గంటల ప్రాంతంలో ఈ విషయంపై డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే ఎస్ఐ చంద్రశేఖర్, ఎస్ఐ దీక్షిత, పెట్రోల్ కార్ డ్రైవర్ వెంకటప్ప క్షణాల్లో ఘటనాస్థలికి చేరుకున్నారు. అప్పటికే సదరు యువతి సరస్సు మధ్యలోకి వెళ్లి ప్రాణాపాయ స్థితిలో ఉండగా పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా నీటిలోకి దిగి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. యువతికి ప్రాథమిక కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం ఆమెను క్షేమంగా బంధువుల వద్దకు చేర్చారు. పోలీసుల స్పందన, సాహసాన్ని కూకట్‌పల్లి డీసీపీ రితా రాజ్ అభినందించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించి, నగదు పురస్కారాలను అందజేశారు.





# విశ్వగురు బసవేశ్వరునికి నివాళి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

బసవేశ్వరుడి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి పాల్గొని బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయక సమాజంలో ఉన్న కుల, మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవేశ్వరుడని తెలిపారు. ఆయన బోధించిన మానవతా విలువలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. బసవేశ్వరుడి సిద్ధాంతాలను కేవలం మాటల్లో కాకుండా జీవితాల్లో ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్టవుతుందన్నారు. అలాగే బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే మహిళలకు సముచిత స్థానం కల్పించి సమానత్వానికి మార్గదర్శకుడిగా నిలిచారని తెలిపారు. ఆయన బోధించిన అభ్యుదయ భావజాలమే నేటి లింగాయత్ ధర్మంగా మారిందని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మూఢ నమ్మకాలపై నిరంతరం పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం ప్రేరణనిస్తోందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లింగాయత్ సంఘ నాయకులు పట్టణంలో బసవేశ్వరుని విగ్రహం, బసవేశ్వర భవనం ఏర్పాటు చేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములు, జిల్లా గౌరవ అధ్యక్షుడు జెమిని సురేష్, జిల్లా అధ్యక్షుడు గిరిజ శంకర్, కార్యదర్శి రాజేష్, మమ్మాయిపల్లి రాజు, మహదేవన్పేట రవిశంకర్ పాల్గొన్నారు.

### బసవేశ్వరుని బోధనలు అనుసరణీయం

**ముద్ర, నారాయణ పేట:**

ప్రజావాణి హాల్లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులు, వీరశైవ సంఘం నేతలు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయన బోధనలలోని సమదృష్టి ఎందరినో ఆకర్షించిందని, సూక్ష్మమైన తత్వం సులువుగా బోధపడేదన్నారు. అలాగే బసవ జయంతి వేడుకల్లో భాగంగా పట్టణంలోని సరఫ్ బజార్ బసవేశ్వర దేవాలయంలో, సింగార్ బేస్ శివలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను జరిపారు.



# ఈకో టూరిజంతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతాయి

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



ఈకో టూరిజం వల్ల అనంతగిరి రూపురేఖలే మారబోతున్నాయని, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు పెద్ద మొత్తంలో పనులు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సోమవారం అనంతగిరి గుట్టలో ఈకో టూరిజం అభివృద్ధిలో భాగంగా అనంతగిరి ఈకో అర్బన్ పార్క్, అనంతగిరి కొండల వీక్షణ గోపురం, అనంతగిరి పర్యావరణ పట్టణ ఉద్యాన వనము, అటవీ అతిథి గృహంలో డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ దీ బ్రీజ్ ను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ డాక్టర్ సి.సువర్ణ, చీఫ్ కన్సర్వేటర్లు ప్రియాంక వర్గీస్, సునీత భగవత్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ , మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య లతో కలిసి సభాపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ అనంతగిరి ప్రాంతాన్ని పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం వల్ల వికారాబాద్ దశలవారీగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకో టూరిజం వల్ల పడిసర ప్రాంతాలు అభివృద్ధి చెందడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడుతాయని ఆయన తెలిపారు. అనంతగిరిగుట్టలో వివిధ ఔషధ గుణాలు కలిగిన మూలికల చెట్లు ఉన్నందున పర్యాటకులు ఈ ప్రాంతానికి పెద్ద మొత్తంలో వస్తున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న పనులంటిని త్వరితగతిన పనులను చేపట్టి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం మూసీ నది జన్మస్థల ప్రాంతాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



# సినీ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలపై హిందూ సంఘాల నిరసన

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నటుడు ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద హిందూ సంఘాలు, బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసిన నిరసనకారులు ప్రకాష్ రాజ్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బూసి రెడ్డి సుధాకర్ రెడ్డి, పిడికిళ్ళ జంగయ్య, శివయ్య గౌడ్ పాల్గొన్నారు. అలాగే భాను ప్రకాష్, శివ కుమార్ నిరసనకు మద్దతు తెలిపారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేంద్రం గౌడ్, టౌన్ అధ్యక్షుడు ప్రమోద్ పాల్గొన్నారు. స్టేట్ కార్యవర్గ సభ్యుడు సుబ్బ రెడ్డి, మిదిదుద్ది చంద్ర శేఖర్, మధు మోహన్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ, ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు హిందూ భావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించారు. ఆయనపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అమెరికాలో ఘోరం..

- భార్యతో గొడవ పడి ఎనిమిది మంది చిన్నారులను కాల్చేసిన మాజీ సైనికుడు
- ఏడుగురు స్వంత పిల్లలతో సహా ఎనిమిది మంది బలి..
- పోలీసుల కాల్పుల్లో నిందితుడు మృతి.



**ముద్ర డెస్క్ :**

అమెరికాలోని లూసియానా రాష్ట్రంలో చోటుచేసుకున్న ఒక అత్యంత క్రూరమైన సామూహిక కాల్పుల ఘటన ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. కన్నతండ్రే కాలయముడిగా మారి తన స్వంత పిల్లలపైనే తూటాల వర్షం కురిపించిన ఈ ఉదంతం.. మానవ సంబంధాలలోని వికృత రూపానికి అద్దం పడుతోంది. ష్రెవ్‌పోర్ట్ నగరంలో జరిగిన ఈ దారుణం అమెరికా సమాజంలో తుపాకీ సంస్కృతి, గృహహింసపై జరుగుతున్న చర్చను మళ్లీ మొదటికి తెచ్చింది.

**నిద్రలోనే చిన్నారుల బలి**

ప్రాథమిక విచారణ ప్రకారం.. 31 ఏళ్ల షమార్ ఎల్కిన్స్ అనే వ్యక్తి ఈ ఘోరానికి ఒడిగట్టాడు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో అందరూ గాఢనిద్రలో ఉన్న వేళ ఈ మారణకాండ మొదలైంది. తన భార్యతో ఏర్పడిన తీవ్ర వాగ్వాదం చివరకు ఎనిమిది మంది చిన్నారుల ప్రాణాలు తీసే వరకు వెళ్ళింది. మరణించిన వారిలో ఏడుగురు ఎల్కిన్స్ స్వంత సంతానం కావడం గమనార్హం. మృతుల వయస్సు కేవలం 3 నుండి 11 ఏళ్ల మధ్య ఉండటం ఈ ఘటనలోని తీవ్రతను, విషాదాన్ని రెట్టింపు చేస్తోంది.

పోలీసుల కథనం ప్రకారం.. ఎల్కిన్స్ చిన్నారులు నిద్రిస్తున్న సమయంలోనే వారి తలలపై కాల్పులు జరిపాడు. ఇంట్లోని ఏడుగురు పిల్లల మృతదేహాలు ఒకేచోట లభించగా, మరో చిన్నారి ప్రాణభయంతో బయటకు పారిపోతుండగా వెంబడించి మరీ కాల్చి చంపినట్లు సమాచారం. ఈ దాడి నుండి ఒక బాలుడు మాత్రం గోడ దూకి తప్పించుకోగలిగాడు, అయితే ఆ ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు.

**విచ్ఛిన్నమైన బంధాలు.. గృహహింస**

ఈ దారుణానికి ప్రధాన కారణం గృహహింస.. దంపతుల మధ్య ఉన్న విభేదాలని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎల్కిన్స్ తన భార్య నుండి విడిపోవడానికి సిద్ధమవుతున్నాడని.. ఆ వివాదంపై సోమవారం కోర్టులో హాజరుకావాల్సి ఉందని తెలుస్తోంది. ఆ కోపంతోనే మొదట తన భార్యపై కాల్పులు జరిపి గాయపరిచాడు. ఆమె ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఎల్కిన్స్ గత చరిత్రను పరిశీలిస్తే అతను లూసియానా ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేసినట్లు తెలిసింది. 2019లో అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్న కేసులో అరెస్ట్ అయినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఆర్మీలో శిక్షణ పొందిన వ్యక్తి కావడంతో తుపాకీ వాడకంలో అతనికి ఉన్న నైపుణ్యం ఈ మారణకాండకు మరింత దోహదం చేసింది.

**ముగిసిన నిందితుడి అధ్యాయం**

ఘటన గురించి సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే ఎల్కిన్స్ లొంగిపోవడానికి నిరాకరించి పోలీసులపైకి తిరగబడటంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో అతను అక్కడికక్కడే మరణించాడు.

**అమెరికాలో పెరుగుతున్న తుపాకీ సంస్కృతి**

గత రెండేళ్లలో అమెరికాలో జరిగిన అత్యంత భయానక సామూహిక కాల్పుల ఘటనల్లో ఇది ఒకటిగా నిలిచిపోతుంది. ఈ ఘటన తర్వాత అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాల పై మళ్లీ డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. గృహహింస ,తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్న వ్యక్తుల చేతికి ఆయుధాలు అందడం ఎంత ప్రమాదకరమో ఈ ఉదంతం నిరూపించింది. ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది చిన్నారులు కన్నతండ్రి చేతిలోనే బలవ్వడం లూసియానా ప్రజలను కన్నీటి పర్యంతం చేస్తోంది. ఈ ఘోరకలిపై విచారణ కొనసాగుతోంది, అయితే అభం శుభం తెలియని ఆ పసిపాపల ప్రాణాలు మాత్రం తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు
అవగాహన పెంచండి
ఇంటి వాళ్లకు,
స్నేహితులకు కూడా ఈ
విషయాన్ని చెప్పండి.
ఇది సామూహిక
ఆరోగ్యానికి ముఖ్యం.





# మేకప్ ఆర్టిస్ట్‌కు మెగా సాయం

- మరోసారి మానవత్వం చాటుకున్న చిరంజీవి

**ముద్ర, సినిమా డెస్క్ :**

మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన గొప్ప మనసుతో అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు. సినిమా పరిశ్రమలో పని చేస్తున్న మేకప్ ఆర్టిస్ట్ శివనాథ్ (శివ) కు హార్ట్ ఆపరేషన్ కోసం అవసరమైన ఆర్థిక సహాయాన్ని ఆయన అందించారు. ఆపదలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న చిరంజీవి వెంటనే స్పందించి 10.5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి స్వయంగా అపోలో ఆసుపత్రికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. చికిత్సలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. సినీ పరిశ్రమలో సహచరులకు అండగా నిలబడటం చిరంజీవికి కొత్త విషయం కాదు. అవసరమైన ప్రతి సందర్భంలో ఆయన ముందుకు వచ్చి సహాయం చేయడం అభిమానుల్లో మరింత గౌరవాన్ని పెంచుతోంది. మెగాస్టార్ చేసిన ఈ సాయం మరోసారి ఆయన మానవతా దృక్పథాన్ని చాటింది. సినీ వర్గాలు, అభిమానులు ఆయన చర్యను ప్రశంసిస్తున్నారు.

# చిరుబాబీ 'కాకాజీ'ను లాక్ చేశారా?

- మెగా 158పై పెరుగుతున్న హైప్

**ముద్ర, సినిమా డెస్క్ :**




'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కాంబినేషన్ మరోసారి భారీ మాస్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వర్కింగ్ టైటిల్‌గా 'మెగా 158'గా పిలుస్తున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే షూటింగ్ ప్రారంభించుకోనుంది.తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాకు 'కాకాజీ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను దాదాపు ఫైనల్ చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో 'కాకా' అనే పేరు కూడా వినిపించగా, ఇప్పుడు 'కాకాజీ' టైటిల్ వైపే టీమ్ మొగ్గుచూపుతోందని తెలుస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో నటించనున్నారని సమాచారం. ఆయన పాత్ర కథలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు బాబీ ఈసారి చిరంజీవిని పూర్తిగా కొత్త అవతారంలో చూపించేందుకు స్క్రిప్ట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. యాక్షన్‌తో పాటు బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌ను మేళవించిన కథతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే డైలాగ్స్, భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. చిరంజీవి కూడా స్క్రిప్ట్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నారని, 'వాల్తేరు వీరయ్య'లో చూపిన మాస్ ఎనర్జీని ఈసారి మరింత పెంచేలా బాబీ ప్లాన్ చేశారని టాక్ వినిపిస్తోంది. ఇక క్లైమాక్స్‌లో వచ్చే భారీ ట్విస్ట్ సినిమాకే కీలక ఆకర్షణగా నిలుస్తుందని, చిరంజీవి - అనిల్ కపూర్ మధ్య సన్నివేశాలు థియేటర్లలో గూస్‌బంప్స్ తెప్పిస్తాయని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. KVN ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఎక్కడా కాంప్రమైజ్ లేకుండా సినిమాను అత్యున్నత స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

# పెద్దిలో స్పెషల్ సాంగ్ క్లియర్

రామ్ చరణ్‌తో సంయుక్త స్టెప్పులు!

**ముద్ర, సినిమాడెస్క్ :**



రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై మరో ఆసక్తికర అప్డేట్ బయటకొచ్చింది. ఈ సినిమాలో హైలైట్ కాబోయే స్పెషల్ సాంగ్ విషయంలో నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడినట్లు సమాచారం. ఈ స్పెషల్ సాంగ్ కోసం మొదట మృణాల్ ఠాకూర్, మానసా వారణాసి పేర్లు వినిపించినప్పటికీ, చివరకు సంయుక్త మీనన్ను ఫైనల్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఇటీవల 'అఖండ 2: తాండవం'లో "జాజికాయ జాజికాయ" పాటతో మాస్ స్టెప్పులు వేసి ఆకట్టుకున్న సంయుక్త, ఇప్పుడు అదే ఎనర్జీతో రామ్ చరణ్‌తో కలిసి స్క్రీన్‌పై సందడి చేయనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతో ఇప్పటికే గుర్తింపు తెచ్చుకున్న ఆమెకు ఈ స్పెషల్ సాంగ్ మరింత ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. ఇక రామ్ చరణ్ ఎనర్జీ, సంయుక్త స్క్రీన్ ప్రెజెన్స్ కలిస్తే ఈ పాట సినిమా హైలైట్ అయ్యే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, 'ఉప్పెన' తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న ప్రాజెక్ట్ కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో రూపొందుతున్న ఈ సినిమాకు సంగీతాన్ని ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. మొత్తంగా 'పెద్ది'లో ఈ స్పెషల్ సాంగ్ ప్రేక్షకులకు ఫుల్ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వబోతుందనే టాక్ బలంగా వినిపిస్తోంది.

# చీరకట్టులో మెరిసిన కేరళ కుట్టి

- న్యూ లుక్‌తో సోషల్ మీడియాలో అనిఖా హల్‌చల్

**ముద్ర, సినిమా డెస్క్ :**

కేరళకు చెందిన యువ నటి అనిఖా సురేంద్రన్ తన తాజా ఫోటోషూట్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంటోంది. సంప్రదాయ శైలిలో తీసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. తాజాగా విడుదలైన చిత్రాల్లో అనిఖా గోల్డెన్ ఆర్గాంజా చీరలో సిల్వర్ డిజైన్స్‌తో మెరిసిపోతూ కనిపించింది. దీనికి జతగా ఆమె ధరించిన డీప్ రెడ్ ప్రింటెడ్ బ్లౌజ్ లుక్‌కు మరింత ఆకర్షణను తెచ్చింది. సంప్రదాయ అందాన్ని హైలైట్ చేస్తూ ఆమె పెద్ద సిల్వర్ ఆక్సిడైజ్డ్ చెవిపోగులు, రంగురంగుల గాజులు, సింపుల్ బొట్టు ధరించి సహజమైన గ్లామర్‌ను ప్రదర్శించింది. ప్రకృతి మధ్యలో తీసిన ఈ ఫోటోలు ఆమె చిరునవ్వుతో మరింత అందంగా మారాయి. బాలనటిగా సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన అనిఖా, ఇప్పుడు హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. గ్లామర్‌తో పాటు నటనలోనూ మెప్పిస్తున్న ఆమె, కొత్త లుక్‌తో మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది.



# దెయ్యాలనూ భయపెట్టించే ఓం శాంతి డిస్కో శాంతి

**ముద్ర, సినిమా డెస్క్ :**




టాలీవుడ్‌లో వినూత్న కథలతో గుర్తింపు పొందిన దర్శకుడు మహి వి. రాఘవ్ మరోసారి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ప్రయత్నంలో ఉన్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'ఓం శాంతి డిస్కో శాంతి' అనే టైటిల్‌తోనే ఆసక్తిని రేపుతోంది. హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా కాన్సెప్ట్ పూర్తిగా భిన్నంగా ఉండబోతోందని సమాచారం. సాధారణంగా దెయ్యాలు మనుషులను భయపెడతాయి. కానీ ఈ సినిమాలో పరిస్థితి పూర్తిగా రివర్స్‌గా ఉండనుంది. భయం అంటే ఏంటో తెలియని కొంతమంది వ్యక్తులు దెయ్యాలను ఎదుర్కొంటే ఏమవుతుంది? ఆ పరిణామాల్లో దెయ్యాలకే భయం పుడుతుందా? అనే వినూత్న ఆలోచనతో ఈ సినిమా రూపొందుతోంది. తాజాగా విడుదలైన మోషన్ పోస్టర్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. "ఆల్ రెడీ కాషన్ కియా.. ఆల్ రెడీ" అనే క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. ఈ చిత్రంలో జంప్ స్కేర్లు, కామెడీ సీన్లు, అనూహ్య ట్విస్టులతో కూడిన వినోదభరిత కథనం ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని ఇవ్వడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. సెప్టెంబర్ నెలలో ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే అందిస్తున్న మహి వి. రాఘవ్ షో రన్నర్‌గా వ్యవహరిస్తుండగా, దర్శకత్వ బాధ్యతలను గోగు ఆర్. ఆర్ నిర్వహిస్తున్నారు. మొత్తానికి, హారర్ కామెడీ జానర్‌లో మరోసారి తనదైన ముద్ర వేయడానికి మహి వి. రాఘవ్ సిద్ధమవుతున్నారని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న వామికా గబ్బి

**ముద్ర, సినిమా డెస్క్ :**

బాలీవుడ్‌లో తన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి వామికా గబ్బి ఇప్పుడు టాలీవుడ్ వైపు దృష్టి సారిస్తోంది. ఇటీవల ఆమె నటించిన హిందీ చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినా, దానిని పక్కన పెట్టి కొత్త అవకాశాలపై ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం వామికా టాలీవుడ్‌లో భారీ ప్రాజెక్ట్‌గా భావిస్తున్న 'G2' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమాలో ఆమె చేరికపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ కావడానికి ఈ సినిమా ఆమెకు మంచి వేదికగా మారనుంది. ఇక భిన్న భాషా చిత్రాల్లోనూ అవకాశాలు అందుకుంటూ, వామికా తన కెరీర్‌ను విస్తరించుకుంటోంది. స్టైలిష్ లుక్స్‌తో పాటు నటనపరంగా కూడా గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె, టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది.



# ఆ మూడు సినిమాలు విజయ్ భవితవ్యం తేలుస్తాయా?

**ముద్ర, సినిమా డెస్క్ :**

టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలకమైన మలుపులో ఉన్నారు. 'టాక్సీవాలా' తర్వాత ఆశించిన స్థాయిలో సక్సెస్‌లు అందుకోలేకపోవడంతో ఆయన తదుపరి చిత్రాలపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం విజయ్ చేతిలో ఉన్న మూడు ప్రాజెక్టులు ఆయన కెరీర్ దిశను నిర్ణయించేలా కనిపిస్తున్నాయి. 'రాజావారు రాణిగారు' ఫేమ్ రాజ్ కిరణ్ కోలా దర్శకత్వంలో రూపొందుతున్న గ్రామీణ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఒకటి కాగా, ఇందులో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రెండవది, 'టాక్సీవాలా'తో హిట్ అందించిన రాహుల్ సంకృత్యాన్‌తో చేస్తున్న 'రణబాలి'. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ సెప్టెంబర్ 11న విడుదలకు సిద్ధమవుతోంది. మూడవది, 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్‌తో విజయ్ చేస్తున్న కొత్త చిత్రం. ఈ ప్రాజెక్ట్ కూడా విభిన్న కాన్సెప్ట్‌తో రూపొందుతోందని సమాచారం. వరుస పరాజయాల నేపథ్యంలో ఈ మూడు సినిమాలు విజయ్ కెరీర్‌కు ఎంతో కీలకంగా మారాయి. ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం ప్రకారం, వీటిలో కనీసం ఒకటి లేదా రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద బలమైన విజయం సాధిస్తేనే ఆయన తిరిగి టైర్ 2 హీరోల రేసులో బలంగా నిలబడే అవకాశం ఉంటుంది. లేకపోతే పరిస్థితి మరింత కఠినంగా మారవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తానికి, ఈ మూడు సినిమాల ఫలితాలు విజయ్ దేవరకొండ భవిష్యత్ దిశను నిర్ణయించే "టర్నింగ్ పాయింట్"గా మారే అవకాశం ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
21.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు

ఫుడ్ డెలివరీ వస్తువులను చెక్ చేయండి

చెంచాలు, కంచాలు నల్లగా ఉంటే వాటిని ఉపయోగించకుండా మీవే వాడండి.





# ముంబై జట్టుపై ఒత్తిడి

- **హార్దిక్ కెప్టెన్సీపై విమర్శలు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

స్టార్ ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నప్పటికీ ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు, అనంతరం వరుసగా నాలుగు మ్యాచ్‌లలో పరాజయాలు చవిచూసింది. దీంతో హార్దిక్ పాండ్యా నాయకత్వంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుస ఓటములతో ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన ముంబై జట్టుపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్లు హార్దిక్ నాయకత్వంపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో నాలుగింటిలో ఓడిన ముంబై ఇండియన్స్ జట్టులో బౌలింగ్ విభాగం బలహీనంగా మారింది. ఐదు మ్యాచ్‌లలో మొత్తం 972 పరుగులు ఇచ్చిన బౌలర్లు 10.26 ఎకానమీ రేటుతో పరుగులను నియంత్రించడంలో విఫలమవుతున్నారు. వికెట్లు తీయడంలో కూడా వెనుకబడటంతో జట్టు పరిస్థితి క్లిష్టంగా మారింది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా వ్యక్తిగత ప్రదర్శన కూడా ఆశించిన స్థాయిలో లేదు. నాలుగు మ్యాచ్‌లలో



81 పరుగులు మాత్రమే చేసిన హార్దిక్, బౌలింగ్‌లో రెండు వికెట్లు మాత్రమే సాధించాడు. ఒక మ్యాచ్‌కు అనారోగ్యం కారణంగా దూరమైనప్పటికీ, మ్యాచ్ గెలిపించే ఇన్నింగ్స్ రాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ భారత క్రికెటర్ ఆకాశ్ చోప్రా హార్దిక్ ప్రదర్శనపై స్పందిస్తూ, ఇటీవల కాలంలో జట్టును ఒంటరిగా గెలిపించే స్థాయి ఇన్నింగ్స్ ఆడలేదని వ్యాఖ్యానించాడు. చిన్న చిన్న ఇన్నింగ్స్‌లు ఆడుతున్నప్పటికీ, జట్టుకు విజయాన్ని అందించే పెద్ద ఇన్నింగ్స్‌లు కనిపించడం లేదని పేర్కొన్నాడు. జట్టు కొత్త ఆలోచనలతో నిర్భయంగా ఆడాల్సిన అవసరం ఉందని సూచించాడు. మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ కూడా ముంబై జట్టు కెప్టెన్సీపై తన అభిప్రాయం వెల్లడించాడు. ముంబై ఇండియన్స్‌కు ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మను మళ్లీ కెప్టెన్‌గా నియమించాలని సూచించాడు. జట్టులో స్థిరత్వం తీసుకురావాలంటే రోహిత్ నాయకత్వం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డాడు. అయితే జట్టు వైఫల్యానికి పూర్తిగా హార్దిక్‌ను మాత్రమే బాధ్యుడిగా చేయడం సరైంది కాదనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బౌలింగ్ విభాగం వరుసగా విఫలమవడం, భారీ స్కోర్లను కాపాడుకోలేకపోవడం జట్టుకు పెద్ద సమస్యగా మారింది. దీంతో బ్యాట్స్‌మెన్‌పై అదనపు ఒత్తిడి పడుతోంది. అయినప్పటికీ కెప్టెన్‌గా, సీనియర్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాత్ర కీలకంగా మారింది. రాబోయే మ్యాచ్‌లలో అతను మెరుగైన ప్రదర్శన ఇస్తాడా లేదా అన్నది అభిమానుల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# మైదానంలో ప్రీతి జింటా సర్‌ప్రైజ్ ఎంట్రీ

- **అర్ష్‌దీప్‌తో హగ్ వీడియో వైరల్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

బాలీవుడ్ నటి, పంజాబ్ కింగ్స్ సహ యజమాని ప్రీతి జింటా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపీఎల్‌లో తన జట్టుకు విజయాలు వచ్చినప్పుడు ఆటగాళ్లను అభినందిస్తూ మైదానంలో కనిపించడం ఆమెకు అలవాటు. గతంలో యువరాజ్ సింగ్, క్రిస్ గేల్ సహా పలువురు ఆటగాళ్లకు ఆమె ఆత్మీయ ఆలింగనం ఇచ్చిన సందర్భాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈసారి ఐపీఎల్ 2026లో బిజీ షెడ్యూల్ కారణంగా కొన్ని మ్యాచ్‌లకు దూరంగా ఉన్న ప్రీతి జింటా, ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌కు హాజరై మళ్లీ అభిమానులను సర్‌ప్రైజ్ చేశారు. లక్నోపై



విజయం సాధించిన అనంతరం మైదానంలోకి వచ్చిన ఆమె, ఆటగాళ్లను అభినందించారు. ఈ క్రమంలో మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించిన పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ఆప్యాయంగా హగ్ చేసుకున్నారు. ఆ క్షణంలో అర్ష్‌దీప్ సింగ్ ఉత్సాహంతో స్పందిస్తూ "యాహూ.. ప్రీతి జింటా హగ్ ఇచ్చిందోచ్" అంటూ ఆనందంతో ఎగిరి గంతేశాడు. ఈ సరదా సన్నివేశం అక్కడ ఉన్నవారందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రీతి జింటా కూడా ఒక్క క్షణం నవ్వుతూ ఆ దృశ్యాన్ని ఆస్వాదించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆటగాళ్లు, యజమాన్యం మధ్య ఉన్న ఆప్యాయత, బలమైన బంధాన్ని ఈ సన్నివేశం స్పష్టంగా చూపిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఇప్పటివరకు ఓటమి ఎరుగని జట్టుగా నిలిచిన పంజాబ్, లక్నోపై విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. జట్టు ప్రస్తుతం 11 పాయింట్లతో దూసుకుపోతోంది.

# విజయం తర్వాత భావోద్వేగ దృశ్యాలు

- **కేకేఆర్ డ్రెస్సింగ్ రూమ్‌లో కన్నీళ్లు పెట్టుకున్న ప్లేయర్స్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తొలి విజయాన్ని నమోదు చేసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో భావోద్వేగ వాతావరణం నెలకొంది. జట్టు సభ్యులందరూ కన్నీళ్లు పెట్టుకున్నారని మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వెల్లడించారు. రాజస్థాన్ రాయల్స్‌పై 4 వికెట్ల తేడాతో గెలిచి ఈ సీజన్‌లో బోణీ కొట్టిన కేకేఆర్, ఆరు మ్యాచ్‌ల ఓటముల తర్వాత ఈ విజయాన్ని సాధించింది. దీంతో ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్ అంతా భావోద్వేగానికి లోనయ్యారు. వరుణ్ చక్రవర్తి మాట్లాడుతూ, గత కొన్ని వారాలు జట్టుకు ఎంతో కష్టంగా గడిచాయని, విమర్శలు ఎదురైనా కోచింగ్ స్టాఫ్ ఆటగాళ్లపై ఒత్తిడి పడకుండా మానసిక స్థైర్యాన్ని ఇచ్చారని తెలిపారు. ఈ విజయానికి ప్రతి ఒక్కరూ అర్హులేనని ఆయన పేర్కొన్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లో కనిపించిన భావోద్వేగ దృశ్యాలు సాధారణం కాదని, 2024లో జట్టు ఛాంపియన్ అయిన సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి చూడలేదని వరుణ్ తెలిపారు. ఈ విజయం జట్టుకు కేవలం రెండు పాయింట్లు మాత్రమే కాకుండా, మానసికంగా కూడా భారీ ఊరటను ఇచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు.





# స్టంపింగ్‌తో ధోనీని గుర్తు చేసిన ధ్రువ్ జురెల్

- **సోషల్ మీడియాలో వైరల్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ తన అద్భుతమైన కీపింగ్ స్కిల్స్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో అతడు చేసిన మెరుపు స్టంపింగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్పిన్నర్ల బౌలింగ్‌లో వికెట్ కీపింగ్ చేయడం చాలా కష్టమైన పని. క్షణాల్లోనే నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితుల్లో జురెల్ చూపిన వేగం, చాకచక్యం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. కేకేఆర్ ఇన్నింగ్స్ సమయంలో కెమెరూన్ గ్రీన్ భారీ షాట్ ఆడేందుకు ముందుకు వచ్చాడు. ఆ సమయంలో రవి బిష్ణోయ్ వేసిన బంతి లెగ్ సైడ్ వైపు వెళ్లింది. సాధారణంగా ఇది వైడ్‌గా వెళ్లే అవకాశం ఉన్నా, జురెల్ ఎడమవైపు డైవ్ చేస్తూ బంతిని అందుకున్నాడు. నియంత్రణ కోల్పోయినా కూడా తక్షణమే స్టంప్స్‌పైకి విసిరి గ్రీన్‌ను ఔట్ చేశాడు. ఈ అద్భుత స్టంపింగ్‌తో రవి బిష్ణోయ్ కీలక వికెట్ సాధించాడు. ప్రస్తుతం అతను 6 ఇన్నింగ్స్‌ల్లో 10 వికెట్లు తీసి మంచి ఫామ్‌లో ఉన్నాడు. జురెల్ చేసిన ఈ స్టంపింగ్‌ను చూసి అభిమానులు టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ గుర్తు చేసుకుంటున్నారు. "ధోనీ తరహా క్విక్ రియాక్షన్" అంటూ సోషల్ మీడియాలో ప్రశంసలు కురుస్తున్నాయి. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, 156 పరుగుల లక్ష్యాన్ని కోల్‌కతా 19.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది.

## యూరప్‌లో తొలి ఫ్రాంచైజీ
# టి20 లీగ్‌కు రూపం

**గ్లాస్గో మగాఫియన్స్ అధికారిక ప్రకటన**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

యూరప్‌లో తొలి ఫ్రాంచైజీ ఆధారిత టి20 లీగ్‌గా యూరోపియన్ T20 ప్రీమియర్ లీగ్ (ETPL) రూపుదిద్దుకుంటోంది. ఈ క్రమంలో లీగ్ నిర్వహణ సంస్థ 'గ్లాస్గో మగాఫియన్స్' అనే కొత్త ఫ్రాంచైజీని అధికారికంగా ప్రకటించింది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరాన్ని ప్రాతినిధ్యం వహించే ఈ జట్టు లీగ్‌లో పాల్గొనే ఆరు జట్లలో ఒకటిగా నిలవనుంది. ఈ ఫ్రాంచైజీకి వెస్టిండీస్ మాజీ కెప్టెన్, టి20 దిగ్గజం క్రిస్ గేల్ సహ యజమానిగా వ్యవహరించనున్నారు. ఆయనతో పాటు భారతీయ వ్యాపారవేత్త తాన్షా బాత్రా కూడా భాగస్వామిగా ఉండనున్నారు. అంతేకాకుండా గేల్ ఈ జట్టుకు గ్లోబల్ బ్రాండ్ అంబాసడర్‌గా కూడా వ్యవహరించనున్నారు. ఫ్రాంచైజీ లాంచ్ సందర్భంగా క్రిస్ గేల్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, కో-ఓనర్‌గా ఈ ప్రయాణం ప్రారంభించడం ఉత్సాహంగా ఉందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌ల అనుభవంతో ETPL ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తాన్షా బాత్రా కూడా ఈ ప్రాజెక్ట్ ద్వారా స్కాట్లాండ్ క్రికెట్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యాన్ని వెల్లడించారు. ఇక యూరోపియన్ T20 ప్రీమియర్ లీగ్ (ETPL) ఐసీసీ ఆమోదం పొందిన యూరప్ తొలి టి20 ఫ్రాంచైజీ లీగ్‌గా నిలవనుంది. క్రికెట్ ఐర్లాండ్, క్రికెట్ స్కాట్లాండ్, రాయల్ డచ్ క్రికెట్ అసోసియేషన్ భాగస్వామ్యంతో ఈ లీగ్ అభివృద్ధి చెందుతోంది. ఈ టోర్నీలో మొత్తం ఆరు జట్లు పాల్గొననున్నాయి. గ్లాస్గోతో పాటు ఆంస్టర్డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్‌ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాల జట్లు పోటీ పడనున్నాయి. ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు 33 మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఇతర జట్ల యాజమాన్యంలో కూడా అంతర్జాతీయ క్రికెట్ ప్రముఖులు భాగస్వాములుగా ఉన్నారు. ఆంస్టర్డామ్ జట్టుకు స్టీవ్ వా సహ యజమానిగా ఉండగా, బెల్‌ఫాస్ట్ జట్టుకు గ్లెన్ మ్యాక్స్‌వెల్ భాగస్వామిగా వ్యవహరించనున్నారు. ఎడిన్‌బర్గ్ జట్టుకు కైల్ మిల్స్, నాథన్ మెకల్లమ్ యజమానులుగా ఉన్నారు. మిచెల్ సాంట్నర్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రపంచ క్రికెట్ ప్రముఖులు, కొత్త మార్కెట్లు కలిసి వస్తున్న ఈ ETPL లీగ్, భవిష్యత్తులో ఫ్రాంచైజీ క్రికెట్‌కు కొత్తదిశను చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.






## బృందావన్ ఆశ్రమంలో
# కోహ్లీ–అనుష్క

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మ ఐపీఎల్ 2026 బిజీ షెడ్యూల్ మధ్యలో సమయం కేటాయించుకుని సోమవారం బృందావన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు శ్రీ హిత్ రాధా కేలి కుంజ్ ఆశ్రమానికి వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ జీ మహారాజ్ ఆశీర్వాదాలు పొందారు. ఆశ్రమంలో విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ గురువుతో 'ఏకాంత సంవాద్' పేరుతో వ్యక్తిగత ఆధ్యాత్మిక చర్చలో పాల్గొన్నారు. భక్తులతో కలిసి నేలపై కూర్చొని ప్రసంగాన్ని శ్రద్ధగా విన్నారు. అక్కడి వాతావరణానికి అనుగుణంగా వినయంగా వ్యవహరిస్తూ చర్చలో పాల్గొన్నట్లు కనిపించారు. సందర్శనలో ఇద్దరూ సాధారణ దుస్తుల్లో దర్శనమిచ్చారు. కంఠీలో తులసి మాలలు ధరించి, నుదుటిపై సంప్రదాయ తిలకాలు పెట్టుకుని ఇతర భక్తులతో కలిసి కూర్చొన్నారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సాదాసీదా వేషధారణలో కనిపించిన ఈ దంపతులు అక్కడి భక్తులను ఆకర్షించారు. గత ఐదు నెలల వ్యవధిలో విరాట్ కోహ్లీ ఈ ఆశ్రమాన్ని సందర్శించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. ఆధ్యాత్మికత పట్ల ఆయనకు ఉన్న ఆసక్తిని ఈ సందర్శనలు సూచిస్తున్నాయి. ఒక సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలో, ఆశ్రమం నుంచి బయటకు వస్తూ ప్రేమానంద్ మహారాజ్‌ను కలిసిన దృశ్యాలు కనిపించాయి.



## తెలుగోడి
# గర్జన

**గుజరాత్ టైటాన్స్‌పై వీరోచిత సెంచరీ**

**ముంబై భారీ స్కోరుకు బాటలు వేసిన తిలక్ వర్మ**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ లో ముంబై బ్యాటర్, తెలుగోడు సెంచరీతో చెలరేగాడు. గాయం వల్ల రోహిత్ శర్మ మైదానం లోకి రాలేదు. ఉన్న ప్లేయర్లు చేతులెత్తేశారు. అదిగో అప్పుడు వచ్చాడు యోధుడి లాగా తెలుగోడు తిలక్ వర్మ. వికెట్లు పడినచోట.. గుజరాత్ బౌలర్లు రెచ్చిపోతున్న చోట అతడు నిలబడ్డాడు. మామూలుగా అతడి స్థానంలో ఇంకొక ఆటగాడు గనుక వచ్చి ఉంటే పరిస్థితి వేరే విధంగా ఉండేది. కానీ తాను మాత్రమే పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటింగ్ చేశాడు. ఆవేశానికి పోలేదు. అనవసరమైన షాట్లు ఆడలేదు. అలాగని చెత్త బంతులను వదిలిపెట్టలేదు. సిరాజ్, రబాడ, రషీద్ వంటి వారు నిప్పులు చెరిగే విధంగా బంతులు వేస్తుంటే.. తిలక్ వర్మ రెస్పెక్ట్ ఇచ్చాడు. అలాగని గతి తప్పిన బంతులను ఏమాత్రం వదిలిపెట్టలేదు. ఫలితంగా ఈ ఐపిఎల్ లో సెంచరీ కొట్టేశాడు. 45 బంతులు ఎదుర్కొన్న అతడు ఎనిమిది ఫోర్లు, 7 సిక్సర్ల సహాయంతో 101* పరుగులు చేశాడు.. తిలక్ వర్మ మైదానంలోకి అడుగుపెట్టే సమయానికి 5.5 ఓవర్లలో 44/3 గా ఉంది ముంబై జట్టు పరిస్థితి. ఆ సమయంలో బ్యాట్ చేత పట్టుకున్న తిలక్ వర్మ నమన్ ధీర్ (45)తో నాలుగో వికెట్ కు 52 పరుగులు, ఐదో వికెట్ కు హార్దిక్ పాండ్యా(15)తో 81 పరుగులు, రూథర్‌ఫర్డ్‌తో ఆరో వికెట్ కు అజేయంగా 22 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. తద్వారా ముంబై జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. సూర్య కుమార్ యాదవ్ విఫలం కావడం.. డికాక్ చేతులెత్తేయడం.. మాలేవార్ రెండు పరుగులకే అవుట్ కావడంతో ముంబై జట్టు తీవ్రమైన కష్టాల్లో పడింది. ఈ దశలో రంగంలోకి దిగిన తిలక్ వర్మ సత్తా చూపించాడు. తనను ముంబై జట్టుకు ఆపద్బాంధవుడు అని ఎందుకు పిలుస్తారో మరోసారి నిరూపించాడు. గొప్ప గొప్ప ప్లేయర్లు విఫలమవుతున్న వేళ.. తను మాత్రం దీప శిఖలాగా నిలబడ్డాడు. అందువల్లే ముంబై జట్టు ఆ స్కోర్ చేయగలిగింది. వరుస ఓటములతో ఇబ్బందుల్లో ఉన్న ముంబై జట్టుకు.. తిలక్ వర్మ ఆడిన ఇన్నింగ్స్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఎందుకంటే ఈ ఐపీఎల్లో ఇప్పటివరకు డికాక్, సంజు శాంసన్ సెంచరీలు చేశారు. ఆ జాబితాలో తిలక్ వర్మ చేరిపోయాడు. జట్టుకు అవసరమైన సందర్భంలో గట్టిగా నిలబడి.. తన స్థాయి నిరూపించుకున్నాడు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
21.04.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**బ్లాక్ ప్లాస్టిక్ వాడకం జాగ్రత్తలు**

పిల్లలకు ప్లాస్టిక్ పరికరాలు ఇవ్వడం తగ్గించండి

పిల్లల ఆరోగ్యం సున్నితమైనది కాబట్టి మరింత జాగ్రత్త అవసరం.






# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కొత్త మెరుపు

- **మామిడిపల్లిలో 'ఎస్ఆర్ఆర్ హిల్స్‌కేప్' విలాసవంతమైన విల్లా ప్రాజెక్ట్ ప్రారంభం!**

ముద్ర, హైదరాబాద్:

భాగ్యనగర రియల్ ఎస్టేట్ రంగం మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు వేదికైంది. నగరవాసులకు అంతర్జాతీయ స్థాయి జీవన ప్రమాణాలను చేరువ చేస్తూ, ప్రముఖ నిర్మాణ సంస్థ SRR ప్రాజెక్ట్స్ మామిడిపల్లి ప్రాంతంలో "SRR హిల్స్‌కేప్" (SRR Hillscape) పేరుతో ఒక భారీ ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ విల్లా ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించింది. ప్రకృతి ఒడిలో, అత్యాధునిక సౌకర్యాల కలయికగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు ఇన్వెస్టర్లను, గృహ కొనుగోలుదారులను విశేషంగా ఆకర్షిస్తోంది.

**వ్యూహాత్మక ప్రదేశం.. అద్భుతమైన కనెక్టివిటీ**

మామిడిపల్లి ప్రాంతం భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ హబ్ గా మారటంతో ఈ ప్రాజెక్ట్‌కు డిమాండ్ పెరిగింది.

ఎయిర్‌పోర్ట్: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం నిమిషాల ప్రయాణం.




ORR: ఔటర్ రింగ్ రోడ్‌కు అతి సమీపంలో ఉండటం వల్ల గచ్చిబౌలి, హైటెక్ సిటీ మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లకు సులభంగా చేరుకోవచ్చు.

సిటీ కనెక్టివిటీ: మెహిదీపట్నం వంటి నగర ప్రధాన ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యం ఉంది.

**నమ్మకానికి మారుపేరు 'SRR Projects'**

2006లో ప్రారంభమైన SRR ప్రాజెక్ట్‌లు, గత రెండు దశాబ్దాలుగా నాణ్యత మరియు సమయ పాలనకు మారుపేరుగా నిలిచింది. పారిశ్రామిక, వాణిజ్య మరియు నివాస రంగాలలో మైలురాళ్లను అధిగమించిన ఈ సంస్థ, ఇప్పుడు 'హిల్స్‌కేప్' ద్వారా విలాసవంతమైన జీవనశైలిని సామాన్యులకు కూడా చేరువ చేస్తోంది. నగర కోలాహలానికి దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో, సొంత ఇంటి కల నెరవేర్చుకునే వారికి, పెట్టుబడిపై మంచి లాభాలు ఆశించే వారికి "SRR హిల్స్‌కేప్" ఒక సువర్ణావకాశం అని రియల్ ఎస్టేట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**ప్రాజెక్ట్ ముఖ్యాంశాలు**

**విస్తీర్ణం:** సుమారు 51 ఎకరాల సువిశాల ప్రాంగణం.

**విల్లాలు:** మొత్తం 355 విలాసవంతమైన ఇండిపెండెంట్ విల్లాలు.

**ప్లాట్ పరిమాణం:** 180 గజాల నుండి 527 చదరపు గజాల వరకు వివిధ శ్రేణుల్లో లభ్యం.

**పర్యావరణం:** ప్రాజెక్ట్ మొత్తంలో 70 శాతం మేర పచ్చదనం (గ్రీనరీ) మరియు ఓపెన్ స్పేస్‌కు కేటాయింపు.

**విలాసానికి కేరాఫ్ అడ్రస్.. ఆధునిక సౌకర్యాలు!**

నివాసితుల వినోదం, ఆరోగ్యం కోసం ఈ ప్రాజెక్ట్‌లో అద్భుతమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు.

**డబుల్ క్లబ్ హౌస్:** అత్యున్నత సౌకర్యాలతో కూడిన రెండు ప్రత్యేకమైన క్లబ్‌హౌస్‌లు.

**క్రీడా సౌకర్యాలు:** గోల్ఫ్ కోర్స్, టెన్నిస్ కోర్ట్ మరియు స్విమ్మింగ్ పూల్.

**వెల్నెస్:** యోగా లాన్, వాకింగ్ ట్రాక్స్ మరియు పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలు.

**కల్చర్:** ప్రదర్శనల కోసం ఓపెన్ ఎయిర్ యాంపి థియేటర్.

**భద్రతకు పెద్దపీట:** స్మార్ట్ యాక్సెస్ కంట్రోల్, సిసిటివి నిఘా, సోలార్ ఫెన్సింగ్‌తో కూడిన త్రీ-టైర్ సెక్యూరిటీ వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు.



# శాంతి చర్చలకు ఇరాన్ దూరం

- **ఉత్కంఠలో పశ్చిమాసియా**
- **అమెరికాతో ఉద్రిక్తతలు మళ్లీ పెరుగుతాయా?**
- **కాల్పుల విరమణ ముగింపు దశలో కీలక మలుపు**

ముద్ర డెస్క్ :

పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్లామాబాద్ వేదికగా నిర్వహించ తలపెట్టిన మలివిడత శాంతి చర్చలకు తాము హాజరు కావడం లేదని ఇరాన్ వెల్లడించింది. అమెరికాతో చర్చలకు ప్రతినిధులను పంపడం లేదని ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. కాల్పుల విరమణ ఒప్పందం మరికొన్ని గంటల్లో ముగియనున్న వేళ ఇరాన్ నుంచి ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటి నుంచి దాన్ని అమెరికా ఉల్లంఘిస్తూనే ఉందని విదేశాంగ శాఖ అధికారప్రతినిధి ఇస్మాయిల్ పేర్కొన్నారు. హర్మూజ్ వద్ద నౌకలను దిగ్బంధించడం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఇరాన్‌కు చెందిన కార్గో షిప్‌ను పట్టుకోవడం వంటి ఉదంతాలను ప్రస్తావించారు. ఒకవేళ అమెరికా దుందుడుకు చర్యలకు పాల్పడితే అదే స్థాయిలో తమ నుంచి బదులుంటుందని హెచ్చరించారు. మరోవైపు రెండో విడత చర్చల కోసం ఇప్పటికే తమ ప్రతినిధులను పాకిస్థాన్ పంపిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. బుధవారంతో కాల్పుల విరమణ ఒప్పందం ముగియనున్న వేళ ఇరాన్ నుంచి ఈ ప్రకటన రావడంతో జరగబోయే పరిణామాల పట్ల ఉత్కంఠ నెలకొంది.

**హర్మూజ్‌పై ట్రంప్ వెనక్కి?**

ఇరాన్‌తో శాంతి చర్చలకు హర్మూజ్ దిగ్బంధనం అడ్డంకిగా మారిన వేళ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దీనిపై తన నిర్ణయం వెనక్కి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. శాంతి చర్చలకు హర్మూజ్ వద్ద అమెరికా దిగ్బంధనం విఘాతం కలిగిస్తోందని పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ట్రంప్‌నకు ఫోన్‌లో తెలిపినట్లు పలు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఈ అంశాన్ని అధ్యక్షుడు పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. శాంతి చర్చలకు తాము హాజరు కాబోవడం లేదని ఇరాన్ స్పష్టంచేసిన నేపథ్యంలో దిగ్బంధనం విషయంలో ట్రంప్ వెనక్కి తగ్గాలనే యోచనలో ఉన్నట్లు సదరు వార్తా కథనాలను బట్టి తెలుస్తోంది.

# పాతరాతియుగ పనిముట్లు వెలుగులోకి

ముద్ర ప్రతినిధి, మెదక్:



మెదక్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న హరిద్రానది (పసుపులేరు) పరిసరాల్లో పురజీవన సంస్కృతి, నాగరికతల ఆనవాళ్లు బయటపడ్డాయి. మంజీరానదిలో పురావస్తు పరిశోధనలు జరిపిన డి.ఎల్.ఎన్. శాస్త్రి వంటి పరిశోధకులు ఇక్కడ పురామానవుల జీవన విధానంలో వివిధ రాతియుగాల నాగరికతలను వెలుగులోకి తీసుకువచ్చారు. పసుపులేరు మంజీరానదికి ఉపనది. హరిద్ర, మంజీర, గోదావరి నదులు కందకుర్తి వద్ద సంగమించి పెద్ద గోదావరి నదిగా తెలంగాణలో ప్రవేశిస్తాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు మచ్చ ప్రణయ్ కుమార్, బుర్రా సంతోష్ మెదక్‌లోని పసుపులేటిలో నిర్వహించిన అన్వేషణలో పాత రాతియుగం నుంచి మధ్య రాతియుగం దాకా చెందిన రాతి పనిముట్లను గుర్తించారు. వీటిలో కొన్ని ఆంత్రోపోమార్ఫిక్ శిలలు కూడా ఉన్నాయి. పురామానవ సాంస్కృతిక ధారకు ఈ పనిముట్లు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. నదీ ప్రవాహంతో కొట్టుకువచ్చిన ఈ రాతి పనిముట్లలో చెర్ట్ రాతితో తయారు చేసిన పాత రాతియుగానికి చెందిన మొన (పాయింట్) పనిముట్టు ఒకటి గుర్తించారు. ఇది గతంలో ఠాకూర్ రాజారాం సింగ్ సేకరణలోని పాత రాతియుగ పనిముట్లను పోలి ఉందని తెలిపారు. ఈ అపురూప రాతి పనిముట్టు ఎగువ పాతరాతి యుగానికి చెందినదిగా భావిస్తున్నారు. ఈ దశలో బ్లేడ్స్ అండ్ బ్యూరిన్స్ తయారీ జరిగింది. ఎగువ పాతరాతియుగం క్రీ.పూ. 40,000-10,000 సంవత్సరాల మధ్య కొనసాగిందని చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు.

# నా శేష జీవితం ఇక కేసీఆర్ నాయకత్వంలోనే

- **మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**
- **తెలంగాణ లో కాంగ్రెస్ ప్రజాకంఠక పాలన**
- **రేవంత్ రెడ్డి ఆలోచనా విధానం కాంగ్రెస్‌కే ప్రమాదం**

ముద్ర, జగిత్యాల :



ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాకంటకంగా మారిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే తిరిగి కేసీఆర్ నాయకత్వమే అవసరమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌తో నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకుని సోమవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. జగిత్యాల వేదికగా గులాబీ జెండా పట్టుకున్న ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దాదాపు 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన తాను ఎప్పుడూ పార్టీకి కీడు కోరలేదని జీవన్ రెడ్డి భావోద్వేగంతో పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న కుట్రపూరిత విధానాలు, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించే తీరుతోనే తాను బయటకు రావాల్సి వచ్చిందని వివరించారు. ముఖ్యంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడంలో రేవంత్ రెడ్డి అనుసరించిన వ్యూహాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. రేవంత్ రెడ్డి ఆలోచనా విధానం కాంగ్రెస్‌కే ప్రమాదమని, అందుకే పార్టీని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఎద్దేవా చేశారు. గతంలో తాను శాసనసభలో, మండలిలో కేసీఆర్ విధానాలను ప్రశ్నించినప్పటికీ అవి నిర్మాణాత్మక విమర్శలేనని గుర్తు చేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనను చూస్తుంటే "ఈయన కంటే కేసీఆర్ గారే నయం" అనే అభిప్రాయం ప్రజల్లో కలుగుతోందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ పునర్నిర్మాణంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కావాలనే కాలయాపన చేస్తూ జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదికల పేరుతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమైపోయాయని ధ్వజమెత్తారు. జగిత్యాల నుంచి మళ్లీ పోటీ చేస్తారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ అభ్యర్థి ఎవరనేది అధినేత కేసీఆర్ నిర్ణయిస్తారని చెప్పారు. తన వ్యక్తిగత పదవుల కంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిన రేవంత్ రెడ్డి పాలనను అంతమొందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. "రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి" అనే నినాదంతోనే తన తదుపరి రాజకీయ ప్రయాణం ఉంటుందని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ సర్కార్ తీరుపై ప్రజలు నైరాశ్యంలో ఉన్నారని, తన శేష జీవితం కేసీఆర్ నాయకత్వంలోనే గడుస్తుందని తెలిపారు. రేవంత్ రెడ్డికి అధిష్ఠానం కాంగ్రెస్ కాదని, మోదీ అని వ్యాఖ్యానించారు.




# గంజాయి సరఫరా చేస్తున్న నలుగురి అరెస్టు

- **మూడు లక్షల విలువైన ఐదు కేజీల గంజాయి స్వాధీనం**
- **ఎస్పీ కే నరసింహ**

ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి :

గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్పీ కే నరసింహ వెల్లడించారు. ఎస్పీ తెలిపిన ప్రకారం.. సోమవారం విశ్వసనీయ సమాచారంతో ఆత్మకూరు గ్రామ శివారులో క్రషర్ మిల్లు వద్ద అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేసి 5 కేజీల గంజాయి, కారు, బైక్, నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని నిమ్మికలకు చెందిన విరబోయిన భరత్, జాజిరెడ్డిగూడెం కొమ్మాల గ్రామానికి చెందిన అరే విజయ్, సూర్యాపేట రూరల్ ఆరెగూడెం గ్రామానికి చెందిన చెవుల మనోజ్, నిమ్మికల్ గ్రామానికి చెందిన కొడిదల శివగా గుర్తించారు. నిందితులు జలసాలకు విలాసాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలని ఆలోచనతో గంజాయి వినియోగించే అలవాటు ఉండడంతో గంజాయిని తెచ్చి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం భరత్, విజయ్, మనోజ్ ముగ్గురు కలిసి కొడిదల శివ కు చెందిన మోటార్ సైకిల్ పై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం సీలేరు వెళ్లి సీలేరు ఏరియాలో గంజాయిని కొనుగోలు చేసి తెచ్చారు. ఈ గంజాయిని పంచుకోవడం కోసం నలుగురు ఆత్మకూరు ఎస్ గ్రామ శివారు క్రషర్ మిల్ వద్దకు రావడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితులను అరెస్టులో పనిచేసిన సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ను, ఆత్మకూరు ఎస్సై శ్రీకాంత్ ను, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# లోయలో పడ్డ బస్సు

- **15మంది మృతి**
- **పలువురికి గాయాలు**

ముద్ర డెస్క్ :

జమ్ముకశ్మీర్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఉధమ్ జిల్లాలో సోమవారం ఉదయం ప్రయాణికుల బస్సు లోయలోపడి 15మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలపై కేంద్రమంత్రి ఆరా తీశారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, రామ్‌నగర్ గ్రామం నుంచి ఉధమ్‌పూర్‌కు వెళ్తుండగా బస్సు ప్రమాదానికి గురైంది. ఉదయం 10గంటల సమయంలో కాగోర్ట్ గ్రామం సమీపంలో ఉన్న ఒక ప్రమాదకరమైన మలుపు వద్ద కొండపై నుంచి బస్సు లోయలో పడింది. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15మంది



మృతి చెందినట్టు గుర్తించినట్లు ఉధమ్‌పూర్ డీఐజీ శివకుమార్ శర్మ తెలిపారు. మరో 20 మందికిపైగా గాయపడ్డారని, ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. అయితే స్థానికులు మాత్రం డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే బస్సు లోయలో పడిందని స్థానికులు అంటున్నారు. బస్సు అతివేగంతో వెళ్లడమే ఈ ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు మరణించిన విషయం తెలుసుకుని తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతు కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

# మేధావులారా మౌనం వీడండి

- **డీలిమిటేషన్, మహిళా బిల్లుపై స్పందించండి**
- **మౌనం సమాజానికి అరిష్టం: బండి సంజయ్**
- **కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు**

ముద్ర, కరీంనగర్ :

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై మేధావులు స్పందించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మేధావుల మౌనం సమాజానికి అరిష్టమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో తప్పు జరిగితే దాన్ని తప్పుగా చెప్పాల్సిన బాధ్యత మేధావులపై ఉందన్నారు. కరీంనగర్‌లో నిర్వహించిన మేధావుల సదస్సులో మాట్లాడుతూ మంచి పనులు జరిగితే వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మీడియా, సోషల్ మీడియా, సదస్సుల ద్వారా అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ చూపిన మార్గంలో సమాజానికి దిశానిర్దేశం చేయాలని కోరారు.

**- అంబేద్కర్ ఆశయాలే మార్గదర్శకం**




రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అట్టడుగు వర్గాల సమానత్వం, స్వేచ్ఛ, హక్కుల కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వంటి అంశాలు అంబేద్కర్ ఆలోచనల్లో భాగమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను భావితరాలకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంబేద్కర్ జీవితం అణగారిన వర్గాలకు మార్గదర్శకమని, ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మరింత అవసరమని తెలిపారు. సమానత్వం, రాజకీయ స్వేచ్ఛ సాధనలో ఆయన చూపిన దారిని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను అమలు చేయడంలో కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. మహిళా బిల్లును అడ్డుకుని దేశ మహిళలకు అన్యాయం చేసిందన్నారు. కొద్దిమంది మహిళలకు మాత్రమే పదవులు ఇవ్వడం ద్వారా న్యాయం చేసినట్లు చూపడం సరికాదని విమర్శించారు. సోనియా, ప్రియాంక, డింపుల్, కనిమొళి, సుప్రియాలకు పదవులు ఇస్తేనే మహిళలకు న్యాయం జరిగిందా అని ప్రశ్నించారు. సాధారణ మహిళలు చట్టసభల్లోకి రావడానికి అవకాశాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ కూటమి వైఖరి మహిళల అభివృద్ధికి అడ్డంకిగా మారిందని అన్నారు.

**సీట్ల పెంపుతో అవకాశాలు**

దేశ జనాభా పెరిగిన నేపథ్యంలో పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డీలిమిటేషన్ అమలైతే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణతో పాటు అదనపు అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. కొత్త నాయకత్వానికి, ముఖ్యంగా మహిళలకు ఎక్కువ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సీట్లు పెరగడం ద్వారా ప్రజలకు సముచిత ప్రాతినిధ్యం లభిస్తుందని, పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఇది కీలక అడుగని పేర్కొన్నారు.

**మేధావులకు పిలుపు**

మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై మేధావులు మౌనం వీడి స్పందించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. సమాజ ప్రయోజనాల కోసం నిజాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మేధావులదేనన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు అందరూ కట్టుబడి పనిచేయాలని కోరారు. సమాజంలో అవగాహన పెంచి సమానత్వం సాధనలో తమ వంతు పాత్ర పోషించాలని మేధావులను కోరారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com